ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 11.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 350 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



టీమిండియాకు రూ.131 కోట్లు 10

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ఏర్పాట్లు



- 2027 జూన్ 26 నుంచి ఆది పుష్కరాలు
- 2028 జూలై 13 నుంచి అంత్య పుష్కరాలు
- గోదావరి పరీవాహక జిల్లాల్లో ప్రముఖ దేవాలయాల అనుసంధానం
- పుష్కరాల కోసం ప్రత్యేకంగా 96 ప్రాంతాల ఎంపిక
- 'గోదావరి పుష్కరాలు 2027' కేబినేట్ సబ్ కమిటీ తొలి సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 10: కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. 'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా.. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా

...:: మిగతా 2లో

అరెస్టు నుంచి ప్రభాకర్‌రావుకు మినహాయింపు

- సాక్ష్యాలు, ఆధారాలు ట్యాంపర్ చేస్తే ముందస్తు బెయిల్ రద్దు
- ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఎక్కడికి వెళ్లకూడదు
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు

...:: 2లో

డాక్టర్ నమత్ర ఆస్తులు అటాచ్

- సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ఈడీ దూకుడు

...:: 2లో



దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ కొరత

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం.. కమర్షియల్ సిలిండర్లపై కంపెనీల నియంత్రణ

- గృహావసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం చర్యలు
- హోటళ్లకు సరఫరా నిలిపివేయాలని ఆదేశాలు
- హోటల్స్ నిర్వహించలేమని బంద్ పాటించే యోచన
- దేశవ్యాప్తంగా ఇప్పటికే మూతబడుతున్న చిన్న హోటళ్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 10 : దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల యుద్ధ ప్రభావం, హోర్ముజ్ సంధిలో చమురు నౌకల రాకపోకలపై ఆంక్షల ప్రభావం మన దేశంలో ఈ పరిస్థితి నెలకింది. దీంతో వెంటనే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెట్రోలియం కంపెనీలు నియంత్రణ చర్యలకు పూనుకున్నాయి. హోటళ్లకు సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని ఆయా సంస్థలు తమ డీలర్లకు ఆదేశాలు జారీ చేశాయి. ఆస్పత్రులు, హాస్టళ్లకు మాత్రమే కమర్షియల్ సిలిండర్లు సరఫరా చేయాలని పెట్రోలియం యాజమాన్యాలు స్పష్టంగా పేర్కొన్నాయి. కమర్షియల్ గ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా హోటల్ పరిశ్రమ కొట్టుమిట్టాడుతోంది. ముంబై, బెంగళూరు, చెన్నై సహా పలు ప్రధాన నగరాల్లోని హోటళ్లకు ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు గ్యాస్ ఇబ్బందులను తెచ్చిపెట్టింది. గ్యాస్ కొరతతో ఇప్పటికే దేశవ్యాప్తంగా చిన్న చిన్న హోటళ్లు మూతబడుతున్నాయి. గ్యాస్ వినియోగదారులు తప్పకుండా ఈకేవైసీ

...:: మిగతా 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - 6.30 (బుధవారం సాయంత్రం)

సహర్ - 5.05 (గురువారం ఉదయం)



ప్రభుత్వ ఒత్తిడికి లొంగిపోయారు

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ జరిగింది. ఓం బిర్లాను పెద్ద మనిషిగా కొనియాడుతూనే విపక్షంపై ఆయన తీసుకున్న కఠిన చర్యలను ప్రతిపక్ష సభ్యులు ఎండగట్టారు.

9

వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

చిటుకుల మైసారెడ్డి

- కూల్చిన చోటే కొత్త ఇళ్లు కట్టించాలి
- కూల్చివేతలపై జిల్లా మంత్రులు ఎందుకు మాట్లాడరు?
- ప్రభుత్వ హామీ వచ్చే వరకు నిరాహార దీక్ష
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/ఖమ్మం, మార్చి 10: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలంటూ ఆమె నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. ఖమ్మంలో సోమవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా దీక్ష ప్రారంభించిన ఆమెను మంగళవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో తన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. వెలుగుమట్లలో కూల్చివేసిన ఇళ్ల స్థానంలోనే కొత్త ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని, అంత వరకు తన దీక్ష కొనసాగుతుందని కవిత ప్రకటించారు. వెలుగుమట్లలో సుమారు 30 ఎకరాల భూదాన్

...:: మిగతా 2లో





పంచాయతీలకు శాశ్వత భవనాలు

- ఉన్నత స్థాయికి తెలంగాణ టూరిజం.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు
- ఏజెన్సీ ప్రాంతాల్లో ట్రైబల్ ఏజెన్సీల ద్వారా ఇసుక మైనింగ్
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు
- ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు
- అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

...:: 2లో



నెహ్రూను విమర్శించే వాళ్లు.. గుర్తు చేసుకుంటున్నారు

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై చర్చ వేళ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఉదహరించడాన్ని ప్రియాంక తీవ్రంగా విమర్శించారు.

9



ఆరు గ్యారెంటీల అమలుపై

కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం

అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ బిల్లు పెడతాం

- వెలుగుమట్ల, మూసీ బాధితుల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకు ఆరు గ్యారెంటీలకు ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధత కల్పించేందుకు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మంగళవారం గోల్కొండ రిసార్ట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే తొలి కేబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీని మరిచిపోయిందని అన్నారు. అందుకే ఆరు గ్యారెంటీల ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పి ఓట్లు

...:: మిగతా 2లో



పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు
- పలువురిని హతమార్చిన ఐడీఎఫ్
- బాంబు పేలుళ్లలతో దద్దరిల్లుతున్న టెహ్రాన్
- ముందు మీరు అంతం కాకుండా చూసుకోండి
- అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్
- ఇరాన్‌క్షిపణిని కుల్చేసిన సౌదీ అరేబియా

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్నాయి. బాంబు పేలుళ్లలతో టెహ్రాన్ దద్దరిల్లుతోంది. ఇజ్రాయెల్, సౌదీ, కువైట్‌లపై ఇరాన్ ప్రతిదాడి చేస్తోంది. దీర్ఘకాల యుద్ధానికి సిద్ధమని ప్రకటించిన ఇరాన్.. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, కువైట్ లక్ష్యంగా డ్రోన్ దాడులు చేస్తోంది. చమురు నిక్షేపాల వైపు వచ్చిన రెండు డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ రక్షణశాఖ ప్రటించింది. ఇక ఆరు డ్రోన్లను తమ నేషనల్ గార్డ్ కూల్చివేసిందని కువైట్ ప్రభుత్వం ప్రకటించింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి

లెబనాన్‌పై ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్ విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాకు చెందిన అల్ క్వార్డ్ అల్ హసన్ అసోసియేషన్ ఆస్తులు, ఆయుధ నిల్వ సౌకర్యాలపై వైమానిక దాడులు చేపట్టింది. హెజ్‌బొల్లా సైనిక సామర్థ్యాలను మరింత దెబ్బతియడానికి ఈ దాడులను ఐడీఎఫ్ చేసింది. ఈ మేరకు ఐడీఎఫ్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.

బీరూట్‌లో ఐదుగురు హతం

అలాగే లెబనాన్ రాజధాని బీరూట్‌లో కచ్చితమైన దాడులు జరిపినట్లు మరో ఎక్స్ పోస్టులో ఐడీఎఫ్ పేర్కొంది. ఈ దాడుల్లో లెబనాన్ కార్ప్స్‌లోని ఐదుగురు సీనియర్ కమాండర్లను హతమార్చినట్లు తెలిపింది. "లెబనాన్ కార్ప్స్ కమాండర్ దావూద్ అలీ జాదే, లెబనాన్‌లోని ఇరాన్ కుద్‌ఫోర్స్ శాఖలకు నిధులను బదిలీ చేసే మాజిద్ హసిని, లెబనాన్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ సెక్టార్ కమాండర్ అలీ రెజా అజార్, లెబనాన్ కార్ప్స్‌లో ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ హసన్ అహ్మద్‌ను హతమార్చాం." అని పోస్టు చేసింది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ సైనిక కార్యాలయ కొత్త అధిపతి అబు అల్ ఖాసిం బాబాయాన్‌ను కూడా హతమార్చినట్లు మరో పోస్టులో ఐడీఎఫ్ తెలిపింది. ఆపరేషన్ రోరింగ్ లయన్‌లో భాగంగా ఈ మెరుపు దాడి జరిగిందని పేర్కొంది.

బాలిస్టిక్ క్షిపణిని కుల్చేసిన సౌదీ అరేబియా

మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలోనూ యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సౌదీ ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం వైపు ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డగించి నాశనం చేశామని సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి చెప్పారు. దేశ రాజధాని నగరం రియాద్‌లో ప్రయోగించిన రెండు డ్రోన్‌లను తమ దళాలు కూల్చివేసినట్లు పేర్కొన్నారు.



యుద్ధం ప్రభావం ప్రజలపై పడనీయొద్దు

పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు మంగళవారం కీలక సూచనలు చేశారు.

9

రాష్ట్రీయం

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

మొదటిపేజీ తరువాయి

శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మంగళవారం బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో సభ్యులు తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వేగంగా పనుల్ని ప్రారంభించేలా ముమ్మర కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి నాటికి డీపీఆర్ లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ - 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. పుష్కర ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తే లేదని, పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

అరెస్టు నుంచి ప్రభాకర్‌రావుకు మినహాయింపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు అరెస్టు నుంచి మినహాయింపు ఇస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించాల్సిందేనన్న జస్టిస్ నాగరత్న ధర్మాసనం సాక్ష్యాలు, ఆధారాలు ట్యాంపర్ చేస్తే ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని తెలిపింది. సాక్షులను ప్రభావితం చేస్తే ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఎక్కడికి వెళ్లకూడదని ధర్మాసనం పేర్కొంది.

గత డిసెంబర్లో సిట్‌విచారణ

గతంలో సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్‌రావు గత డిసెంబర్ నెలలో సిట్ ఎదుట లొంగిపోయారు. ఆయన్ని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేసేందుకు సిట్‌కు సుప్రీంకోర్టు అనుమతించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, దర్యాప్తు అధికారి వెంకటగిరి విచారించారు. ప్రభాకర్ రావు వినియోగించిన జీమెయిల్, ఐ క్లౌడ్ ఖాతాల సమాచారం గురించి పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్‌రావును గత డిసెంబర్ నెల 19 వరకు పోలీస్ కస్టడీలోనే ఉంచి విచారించారు. సిట్ కార్యాలయంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సిట్ విచారణలో తన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లాంటి డివైజ్‌ల పాస్‌వర్డ్‌లు తనకు గుర్తు లేవని ప్రభాకర్‌రావు చెప్పడంతో సుపరిచితమైన పది ఆప్షన్లను ఎంచుకొని పాస్‌వర్డ్‌లను గుర్తించాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆయనకు స్పష్టం చేసింది. ఆ ప్రయత్నంలోనే ప్రభాకర్‌రావు కొన్ని పాస్‌వర్డ్‌లను చెప్పడంతో ఆయా డివైజ్‌లను తెరిచి ఎఫ్ఎస్ఎల్‌లో డేటాను రిట్రీవ్ చేయడంపై సిట్ దృష్టి సారించింది. వాటిల్లోని డేటాను తొలగించినట్లు ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణలో తేలింది. అదే విషయమై నాడు సిట్ ప్రశ్నిస్తే డివైజ్‌ల్లోని తన వ్యక్తిగత సమాచారాన్ని మాత్రమే తొలగించానని ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలంలో వాస్తవమెంత అని తెలుసుకునేందుకు జీమెయిల్, ఐ క్లౌడ్ ఖాతాలను లోతుగా విశ్లేషించడంపై సిట్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

డాక్టర్ నమత్ర ఆస్తులు అటాచ్

- సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ఈడీ దూకుడు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ఈడీ దూకుడుగా ముందుకు వెళ్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. దాదాపు రూ. 50 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు మంగళవారం ప్రకటించారు. సృష్టి కేసులో సీసీఎస్ పోలీసుల విచారణ తర్వాత.. ఈడీ కూడా ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టింది. సృష్టి కేసులో డాక్టర్ నమ్రతను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం తమ కస్టడీకి నమ్రతను ఇవ్వాలంటూ సీసీఎస్ పోలీసులను ఈడీ అధికారులు కోరారు. ఆ క్రమంలో రెండు రోజుల పాటు డాక్టర్ నమ్రతను విచారించిన ఈడీ అధికారులు.. పలు కీలక విషయాలను రాబట్టారు. దీంతో రూ. 50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఈడీ అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2014 నుంచి సరోగసీ అక్రమాలకు ఆమె పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. అలాగే నమ్రతపై సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్.. దర్యాప్తు నివేదిక ఆధారంగా చేసుకుని ఈడీ దూకుడు పెంచింది. అంతేకాకుండా.. ఈ కేసులో మనీ లాండరింగ్ కూడా ఉందని ఈడీ భావిస్తోంది. ముఖ్యంగా పిల్లలు లేని తల్లిదండ్రులకు సరోగసీ పేరు చెప్పి భారీగా రూ. లక్షల్లో నగదు వసూలు చేసి మోసం చేసినట్లు ఈ దర్యాప్తులో గుర్తించారు. ఇక గిరిజన తండాల్లోని పిల్లలను కొనుగోలు చేసి.. విక్రయించినట్లు తెలుస్తోంది. సరోగసీ ద్వారా కోట్లాది రూపాయిలను డాక్టర్ నమ్రతా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ నగదునంతా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది. అందులో భాగంగానే రూ. 50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయాలని ఈడీ అధికారులు నిర్ణయించారు. దీంతో డాక్టర్ నమ్రతకు చెందిన మొత్తం 50 స్థిరాస్తులను ఈడీ అధికారులు సీజ్ చేశారు. భూములు, ఫ్లాట్లు, ఆసుపత్రి సహా పలు ఆస్తులను అటాచ్ చేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.50 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసు దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేద గర్భిణీలను నగదుతో ప్రలోభపెట్టి పిల్లలను కొనుగోలు చేసినట్లు కనుగొన్నారు. ఆడపిల్లకు రూ. 3.5 లక్షలు, మగపిల్లవానికి రూ 4.5 లక్షలు చెల్లించారు. జనన రికార్డుల్లో తల్లిదండ్రుల పేర్లు సైతం ఫోర్జరీ చేసినట్లు గుర్తించినట్లు సమాచారం.

పంచాయతీలకు శాశ్వత భవనాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని, ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతులతో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారని, వారందరినీ శిశు విహార్ లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్ లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎం ఓ యు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటిసి సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళారూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు జీవనోపాధి కలగడంతో పాటు సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం , డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక సేవలే లక్ష్యం: మంత్రి పొంగులేటి

రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు ముఖ్యంగా రైతులకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడానికి రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీసర్వే చేపట్టబోతున్నామని, ఇందుకు సంబంధించి 2026.27 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ప్రజా పరిపాలన సౌలభ్యం కోసం బడ్జెట్ కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రంలో ఇప్పటివరకు గ్యాస్ కొరత లేదు. గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా సిలిండర్లు ఉన్నాయి. బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా నిఘా బృందాలతో పర్యవేక్షిస్తున్నాం. అలాంటివి ఎక్కడైనా ఉంటే ప్రజలు సమాచారం ఇవ్వాలి. గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

\- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

దేశ వ్యాప్తంగా వంట గ్యాస్ కొరత

మొదటిపేజీ తరువాయి

చేసుకోవాలని సూచించాయి. అలా చేసుకోని గృహ వినియోగదారులకు సైతం ఇక నుంచి గ్యాస్ బుకింగ్ నిలిచిపోనుంది. ఇటీవల గృహ వినియోగ సిలిండర్ బుకింగ్ వ్యవధిని 20నుంతి 25 రోజులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే.

ఇబ్బందులు ఎదురవకుండా..

తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. మన రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎల్పీజీ కొరత వచ్చే అవకాశం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదురవకుండా మాత్రమే కేంద్రం అప్రమత్తమైందని తెలిపారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు సిలిండర్లను నిలుపుదల చేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. డిస్ట్రిబ్యూటర్ల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ల సరఫరా దాదాపు ఆగిపోయింది. హాస్టళ్లకు, ఆస్పత్రులు లాంటి అత్యవసర విభాగాలకు మినహాయింపును ఇచ్చారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని విభాగాలకు పరిమితులు విధించారు. యుద్ధం కారణంగా సరిపడినంత గ్యాస్ సరఫరా లేకపోవడంపై ఉన్నత స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న గ్యాస్ ఏయే రంగాలకు సరఫరా చేయాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఆయిల్ కంపెనీలు గ్యాస్ సరఫరాను కొనసాగించనున్నాయి. గృహ వినియోగదారులు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవకాశం ఉన్నంత వరకు ఇండక్షన్ స్టవ్ లాంటి వాటిని వాడుకోవాలని అధికారులు సూచించారు.

ప్రత్యామ్నాయం చూపించాలి
హోటల్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా హోటల్స్ బంద్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. హోటళ్లలో వంట చేయడానికి సరిపడా గ్యాస్ లేకపోవడంతో తీవ్ర సమస్య ఎదురవుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి సాయం చేయాలని కోరారు. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయాలను చూపించకుంటే హోటల్స్‌ని తప్పనిసరిగా మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే ముంబై, బెంగళూరు వంటి నగరాలలో హోటల్స్ బంద్ నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు.

వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

మొదటిపేజీ తరువాయి



భూమి ఉండగా, మరో 30 ఎకరాలు ఆక్రమణకు గురైన భూదాన్ భూమి ఉందని తెలిపారు. మొత్తంగా 62 ఎకరాల భూదాన్ భూమి ఉన్న ప్రాంతంలో పేదలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తూ ఇళ్లు నిర్మించుకున్నారని చెప్పారు. భూదాన్ భూమి అనేది పేదలకు ఇచ్చిన భూమి కాగా, అలాంటి భూమిలో ప్రభుత్వమే కర్కశంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఇటీవల అర్ధరాత్రి బుల్డోజర్లతో సుమారు 750 ఇళ్లను కూల్చివేసారని, టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థుల హాల్ టికెట్లు ఉన్న ఇళ్లను కూడా కూల్చివేయడం అమానుషమని విమర్శించారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను అంబేద్కర్ భవన్‌లోకి తరలించారని, అక్కడ వారికి సరైన సౌకర్యాలు కూడా లేవని తెలిపారు. పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయని, వారి ఆరోగ్యం ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులంతా కూలి చేసుకునే పేదవాళ్లేనని, ఎన్నో ఏళ్లుగా కష్టపడి కట్టుకున్న ఇళ్లను నిమిషాల్లో కూల్చివేయడం అత్యంత అన్యాయమని అన్నారు. వారికి కనీసం భోజనం కూడా ప్రభుత్వం అందించడం లేదని, దాతలపై ఆధార పడే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. బాధితుల పరిస్థితిని పరిశీలించాలని కలెక్టర్‌ను కోరుతూ ధర్నా నిర్వహించామని, అయితే ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ తమను అరెస్ట్ చేసిందని కవిత ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, తెలంగాణ జాగృతి, ధర్మసమాజ్ పార్టీ నేత విశారదన్‌తో కలిసి సంయుక్తంగా ఆందోళన చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన వస్తుందనే ఆశతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష ప్రారంభించామని, అయితే మంగళవారం ఉదయం సుమారు 600 మంది పోలీసులు వచ్చి తమను అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించారని తెలిపారు. తాము ఏదో ఉగ్రవాదులమన్నట్లు వ్యవహరించారని విమర్శించారు. విశారదన్‌ను ఎక్కడికి తీసుకెళ్లారో తెలియడం లేదని, ఆయన ఆచూకీ తెలిసిన తర్వాత కూడా పోరాటం కొనసాగుతుందని అన్నారు. వెలుగుమట్లలో భూదాన్ భూమిలో ఉన్న ఇళ్లను కూల్చివేసి ఆ ప్రాంతాన్ని చదును చేసి పెద్దలకే అప్పగించే కుట్ర జరుగుతోందని కవిత ఆరోపించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణలో జరుగుతున్న ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెలుగుమట్లలో నిజంగా ఏమి జరిగిందో తెలుసుకోవాలని, ఇండిపెండెంట్ జ్యుడీషియల్ ఎంక్వైరీ ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీని కోరారు. భూదాన్ బోర్డు పేదలకు ఇచ్చిన భూములకు ఇప్పటికే పట్టాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. జీవో 58 కింద బాధితులు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తులు కూడా చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ భూమి కాని చోట నోటీసులు ఇవ్వకుండా ఎలా ఇళ్లు కూల్చివేస్తారని ప్రశ్నించారు. భూదాన్ భూమిని ఆక్రమించుకునే హక్కు ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందని నిలదీశారు. తెలంగాణలో పేదల భూములను ప్రభుత్వమే కబ్జా చేస్తోందని ఆరోపించిన కవిత, దీనిపై న్యాయపరంగా కూడా పోరాటం చేస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పేదల ఇళ్లను కూల్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జులుం చేస్తోందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ పెద్దల బిల్డింగ్‌ల జోలికి వెళ్లడం లేదని అన్నారు. ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఈ ఘటనపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ కూల్చివేతల వెనుక వారి హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

స్పష్టత వచ్చే వరకు తమ దీక్ష విరమించేది లేదు

వెలుగుమట్ల బాధితుల కోసం తాము చేస్తున్న ఆందోళనతో ప్రభుత్వం ఆలోచనలో పడినట్లు సమాచారం అందిందని కల్వకుంట్ల కవిత అన్నారు. తమ ఆందోళన, బాధితుల వేదన చూసిన ప్రభుత్వం కూల్చిన చోటనే నిర్వాసితులకు ఇండ్లు కట్టించడానికి నిర్ణయించినట్లు తెలిసిందన్నారు. ఎంతమందికి ఇండ్లు కట్టిస్తారో స్పష్టత వచ్చే వరకు తమ దీక్ష విరమించేది లేదన్నారు. మొత్తం 750 కుటుంబాలకు అక్కడే ఇండ్లు కట్టించాలని సూచించారు. బుధవారం మధ్యాహ్నం మంత్రులు ఈ మేరకు ప్రకటన చేస్తారని సమాచారముందని, అది చూశాక దీక్షపై నిర్ణయం తీసుకుంటామని కవిత ప్రకటించారు.

ఆరు గ్యారెంటీల అమలుపై

కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం

మొదటిపేజీ తరువాయి

వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఈ బిల్లు ద్వారా ఎండగడతామన్నారు. 6 గ్యారంటీలలో పేర్కొన్న మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, రైతన్నలు వంటి తెలంగాణ సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం నేపథ్యంలో ఆయా వర్గాల తరపున ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశ పెట్టనున్నట్లు కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మోసాన్నిఎండగడతాం..

రాహుల్ గాంధీతో సహా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని కూడా ఈ బిల్లు ద్వారా శాసనసభలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే సగం ప్రభుత్వ పదవీ కాలం అయిపోయింది. హామీల అమలులో ప్రజలు ఇచ్చిన వ్యవధి అయిపోయింది. వారి హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన ఈరోజు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పైన ఈ అసెంబ్లీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించామని కేటీఆర్ తెలిపారు. 'ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా అసెంబ్లీలో ఏ కమిటీలను వేయడం లేదు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీని మా పార్టీ నుంచి ద్రోహం చేసి పోయిన వ్యక్తికి ఇచ్చారు. ఒక్క సెలెక్ట్ కమిటీ లేదు, స్టాండింగ్ కమిటీ లేదు, పిటిషన్స్ కమిటీ లేదు. ఇలా డిప్యూటీస్పీకర్ కూడా శాసనసభలో లేరు. కేవలం అనివార్యంగా శాసనసభ సమావేశాలను నడిపించాల్సి వస్తుంది కాబట్టి ప్రభుత్వం బలవంతంగా నడిపిస్తున్నది.' అని కేటీఆర్ అన్నారు.

తూతూమంత్రంగా శాసనసభ సమావేశాలు

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో బుల్డోజర్లను పంపి ఇళ్లను కూలగొడుతున్న తీరుగానే శాసనసభలోనూ కాంగ్రెస్ మంద బలంతో బుల్డోజర్ టాక్టిక్స్ ని ప్రయోగిస్తున్నది. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అబద్ధాలను, అసత్యాలను పచ్చిగా మాట్లాడుతూ అంకెలను తారుమారు చేస్తూ శాసనసభ సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నది' అని కేటీఆర్ న్నారు. ఆరు గ్యారెంటీలకు మొదటి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ రెండున్నర సంవత్సరాల తర్వాత కూడా చట్టబద్ధత పక్కన పెట్టి కనీసం అమలు కూడా చేయడం లేదన్నారు. అందుకే ఈ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును మా పార్టీ తరపున తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. మేము పెట్టే ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకి మద్దతు ఇవ్వాలని మేము కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్తున్న రేవంత్ రెడ్డి రైతన్నలకు ఇవ్వాల్సిన రైతు బంధును మాత్రం పక్కన పెట్టాడని ఎద్దేవా చేశారు.

అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం

'ఖమ్మంలో ప్రభుత్వ దాష్టీకం వల్ల ఇళ్లు కోల్పోయిన ఖమ్మం వెలుగుమట్ల తరపున, మూసీ బాధితుల తరపున, పేద దళిత గిరిజన ప్రజల కోసం ఈ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ పైన ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీలో ప్రభుత్వం చేస్తున్న అంకెల గారడీని, లేని అప్పులను ఉన్నవిగా చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధాలను అంకెలతో సహా ఎండగట్టాలని ఈ రోజు జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇస్తామన్న నిధులు ఎందుకు కేటాయించలేదో నిలదీస్తాం. దీంతోపాటు ఆయా వర్గాలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీ పైన ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఈరోజు జరిగిన సమావేశాల మాదిరి భవిష్యత్తులోనూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తాం' అని కేటీఆర్ అన్నారు.

ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' విజయవంతం చేయాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 10: 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్అన్నారు. అక్కన్న పేట మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై సర్పంచ్లు, పంచాయతీ సెక్రటరీలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చ్ 6 నుండి జూన్ 12 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని, మొదట మనం మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ క్లియరెన్స్ చేయాలని అన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు భద్రతా సంరక్షణలో బాగంగా అరైవ్, అలైవ్ సురక్షితంపై కార్యక్రమం నిర్వహించాలని మంత్రి అన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు సన్న బియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలు అర్హత ఉండి ఇంకా రానివారిని గుర్తించాలని అన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు, గంజాయి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. 18 సంవత్సరాల పైన ఉన్న యువకులకు గ్రామాల్లో డ్రైవింగ్ లైసెన్స్ లు ఇప్పించాలని అన్నారు. వ్యవసాయం, ఆయిల్ పీమ్, హార్టికల్చర్, శాస్త్రీయవేత్తల సలహాల సూచనల మేరకు పంటల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుందని, ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులకు యజమానులను చేస్తుందని తెలిపారు. వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

హుస్నాబాద్ లో దావత్ ఏ ఇఫ్తార్

రంజాన్ మాసం సందర్భంగా హుస్నాబాద్ లో దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజులపాటు ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేస్తూ ప్రార్థనలు చేస్తారని అల్లాహ్ ఆశీర్వాదంతో రాష్ట్ర మంత మంచి వర్షాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలని కాంక్షించారు.

నర్మెట్ట ఆయిల్ పామ్ యూనిట్ 22న ప్రారంభం

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 20 నుంచి 22 వరకు రైతు మేళా నిర్వహణ
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- నిర్వహణపై అధికారులతో సమీక్ష



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడుతోందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణపై వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో స్థాపించబడిన రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు నిర్వహణలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ మిల్లుల సమిష్టి సామర్థ్యం గంటకు 120 మెట్రిక్ టన్నులుగా ఉందని చెప్పారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్లు ఆయిల్ పామ్ రైతులు పండించే పండ్లను త్వరితగతిన ప్రాసెస్ చేసి వారికి సరైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించిందని మంత్రి తెలిపారు. ప్రారంభ దశలో ఈ యూనిట్ గంటకు 30 టన్నుల సామర్థ్యంతో పనిచేయనుండగా, భవిష్యత్తులో దీనిని గంటకు 120 టన్నుల వరకు విస్తరించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ యూనిట్ ప్రారంభంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రాసెసింగ్, నిల్వ మరియు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. రైతులు తమ పంటలను నేరుగా ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకువచ్చి ప్రాసెస్ చేయించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో నూనె తయారీ జరగడం వల్ల నాణ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన యంత్రాలు, ఆయిల్ పామ్ సాగు విధానాలు, ఉత్పత్తి పెంపు మార్గాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేసి రైతులకు ప్రత్యక్షంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

దేశంలోనే మేటిగా తెలంగాణ పర్యాటక రంగం

- తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించాలి
- రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశంలోనే మేటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) కార్యాలయంలో సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యాటక ఆస్తుల వినియోగం, ప్రాచుర్యం, ప్రచారం, ఆదాయ మార్గాలు, హరిత హోటళ్ల నిర్వహణ, పెండింగ్ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో సూచిక బోర్డులు, ఫుడ్ కోర్టులు, టూరిజం సమాచార కేంద్రాలు వంటి ప్రాథమిక సౌకర్యాల స్థితిగతులపై మంత్రి సమీక్షించారు. బోటింగ్ సౌకర్యాలు, కాటేజీలు, వ్యూ పాయింట్లు, హరిత హోటళ్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, పర్యాటకుల సంఖ్య పెరిగేలా, వారికి మరింత సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి తెలంగాణను ఆకర్షణీయమైన టూరిజం గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులు సులభంగా చేరుకునేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రసిద్ధ ప్రదేశాల్లో హంపి థియేటర్లు నిర్మించాలని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆయా రూట్లలో నడుస్తున్న బస్సుల వివరాలను, ఆదాయంపై మంత్రి ఆరా తీశారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం పర్యాటక ప్యాకేజీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేయడంతో గణనీయంగా ఆదాయం తగ్గిందని మంత్రికి అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చెప్పగా మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి బస్సులను కొనుగోలు చేశామని, వాటిని నిరుపయోగంగా ఉంచడం వల్ల ఆదాయం కొల్పోవాల్సి వస్తుందని, స్పెషల్ ప్యాకేజీలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అవమానాలు ఇంకెంత కాలం భరించాలి

- పార్టీ మార్పుపై పునరాలోచన చేస్తున్నా
- సందర్భం వచ్చినపుడు నిర్ణయం తీసుకుంటా
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం, జగిత్యాల, మార్చి 10: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై పునరాలోచనలో ఉన్నానని, అవమానాలు ఇంకెంత కాలం భరించాలని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమయం, సందర్భం వచ్చినపుడు నిర్ణయం తీసుకుంటానని, మంగళవారం జగిత్యాల కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఇటీవల పార్టీ మారుతున్నారన్న ప్రచారంపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఏ అంశమైనా మీకు తెలియకుండా జరగదు, మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజే ఇక్కడ పరిస్థితి గురించి చెప్పాను, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలా? వద్దా అన్న నిర్ణయం త్వరలో చెబుతా అన్నారు. పార్టీ మార్పుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా, కార్యకర్తలకు సంప్రదించి మీడియా ద్వారానే వెల్లడిస్తానని అన్నారు. ఇదిలా ఉంటే.. గత కొంత కాలంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ (బీఆర్ఎస్ నుంచి వచ్చినవారు)కు ప్రాధాన్యత ఇవ్వడం, మున్సిపల్ ఎన్నికల పరిణామాలపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తనను సంప్రదించారని వార్తలు వచ్చిన నేపథ్యంలో, ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

మహిళల భద్రత, స్వావలంబన కోసం

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణం

- రాష్ట్ర పంచాయతిరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: హైదరాబాద్‌నగరంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర పంచాయతిరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జూబ్లీహిల్స్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యోగం, విద్య కోసం నగరాలకు వచ్చే మహిళలకు భద్రతతో కూడిన, సౌకర్యవంతమైన నివాస వసతి కల్పించడం చాలా అవసరమని, ఆ అవసరాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సుమారు 200 కోట్ల రూపాయల వ్యయంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని ఖైరతాబాద్, షేక్‌పేట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో ఈ హాస్టల్స్ నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఒక్కో హాస్టల్ నిర్మాణానికి సుమారు 20 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, ఒక్కో హాస్టల్‌లో కనీసం 500 మంది మహిళలు నివసించే విధంగా అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అవయవ మార్పిడి చికిత్సలో ఆదర్శంగా నిలవాలి

- అవయవ దానం ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి
- విధివిధానాలను సరళీకృతం చేయాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- అవయవ మార్పిడి చార్జీలపై మంత్రి ఆగ్రహం
- ప్రైవేట్‌ఆసుపత్రుల యాజమాన్యాలతో సమీక్ష



ప్తరిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్ పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఃచర్చించారు. రాష్ట్రంలో ఆర్గాన్ డొనేషన్స్ యాక్ట్ సమర్థవంతంగా అమలు అయ్యేలా అవసరమైన సమగ్ర పాలసీ రూపకల్పనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ప్రైవేటు ఆసుపత్రులలో అవయవ మార్పిడి చికిత్సల ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని మంత్రి ప్రైవేట్ యాజమాన్యాల కు సూచించారు. దాతలు ఇచ్చిన అవయవాలు వృధా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్స కోసం 4 ఆసుపత్రులు అనుమతులు ఇచ్చామన్నారు. అలాగే, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారుల ఆదేశించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. శ్రీ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



టెక్స్‌టైల్ రంగంలో ప్రధాన కేంద్రంగా తెలంగాణ

- ఏప్రిల్‌లో 13వ ఏషియన్‌టెక్స్‌టైటైల్‌కాన్ఫరెన్స్
- గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణను దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో టెక్స్‌టైల్ రంగంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులుతుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న 13వ ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026కు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రులు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో జరిగే ఏటెక్స్‌కాన్-2026 ద్వారా దేశీయఅంతర్జాతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా తెలంగాణలో టెక్స్‌టైల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం సిఐటీఐ భాగస్వామ్యంతో 2026 ఏప్రిల్ 2 ,3 తేదీల్లో హైదరాబాద్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనుంది. సమావేశంలో టెక్స్‌టైల్ రంగంలో సస్టెనబిలిటీ, సాంకేతికత, సరఫరా వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ మార్కెట్ల అవకాశాలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదనంగా, ఏప్రిల్ 4న వరంగల్‌లోని పీఎం మిత్ర పార్క్‌కు పరిశ్రమల సందర్శన కూడా నిర్వహించనున్నారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణను టెక్స్‌టైల్, అపారెల్ మరియు ఫుట్‌వేర్ తయారీకి అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలియజేశారు.

12న జిల్లా కేంద్రాల్లో ప్రజాప్రతినిధులకు శిక్షణ

- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించాలి
- జిల్లా అధికారులకు సీఎస్‌ఆదేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు , 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. జూన్ 12 వతేదీ వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 12 న కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై నేడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టీకే శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి సంబంధిత జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించాలని సీఎస్ స్పష్టం చేశారు.



గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి


- పశు వైద్యాధికారిణి డాక్టర్ దేవిరెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 10 : తప్పనిసరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని పశు వైద్య అధికారిణి దేవిరెడ్డి అన్నారు. అమ్డాపూర్ గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ దేవి రెడ్డి మాట్లాడుతూ.....గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని, పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని తెలిపారు. నాలుగు నెలలు పైబడిన గోవు, గేదె జాతి పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. కృష్ణ, ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఓఎస్ రవి, గోపాలమిత్ర శ్రీను, పశుపోషకులు పాల్గొన్నారు.



కనకమామిడి గ్రామంలో శుభ్రత కార్యక్రమం

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 10: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. మోయినాబాద్ మండలం పరిధిలోని కనకమామిడి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి పాల్గొని గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో శుభ్రపరిచే పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లను శుభ్రపరచడం, డ్రైనేజీలలో పేరుకుపోయిన మురుగును తొలగించడం, కాలువలను శుభ్రం చేయించడం వంటి పనులు చేపట్టారు. అలాగే వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు డ్రైనేజీ ప్రాంతాల్లో క్లీనింగ్ పౌడర్ చల్లడం, సున్నం వేయడం వంటి చర్యలు కూడా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు మహేష్ యాదవ్, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు అందరూ కలిసి పనిచేయాలని సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



"మిడిల్ ఈస్ట్‌లో యుద్ధం, హార్ముజ్ జలసంధి మూసివేతతో చమురు సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో మేము యూరప్ దేశాలకు ఆయిల్, గ్యాస్ సప్లై చేయడానికి సిద్ధంగా ఉన్నాం. యురోపియన్ కంపెనీలు, కొనుగోలుదారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా దీర్ఘకాలిక సహకారం అందిస్తామంటే ఆయిల్ పంపడానికి మాకు అభ్యంతరం లేదు.

- రష్యా అధ్యక్షుడు పుతిన్

ఓపెన్ వాయిస్

ఈ యుద్ధాలకు ముగింపు ఎప్పుడు?

భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి.2016-2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990-91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడమే ఇందుకు కారణం. ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళ్లు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియజేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యాఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. ఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షణ సిరియాపై దాడి చేసింది.ఇక భారత్‌లో 2017లోడోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది.ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొంటారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి. సమాజం ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోలుకోవడానికి సంవత్సరాలు లేదా దశాబ్దాలు పట్టవచ్చును. దేశ వనరులు చాలా వరకు ప్రగతి నుండి సైనిక అవసరాలకు కేటాయింపబడవచ్చును.దేశంలో నెలకొన్న సంక్షోభం వల్ల, జనంలో రేకెత్తిన తీవ్ర భావాల వల్ల ప్రజలను రెచ్చ కొట్టే నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనే అవకాశం ఎక్కువవుతుంది.అణ్వాయుధాలు, రసాయనిక ఆయుధాలు, మందు పాతరలు వంటి వాటి వినియోగాల వల్ల ఆరోగ్యం, జీవనం అస్తవ్యస్తం కావచ్చును.మొత్తంగా 2016 నుంచి 2026 వరకు 61 యుద్ధాలు జరిగాయి. దీంతో మోదీ చేసిన ప్రకటన తప్పు అనిపిస్తుంది. భారత్ యుద్ధానికి సర్వదా సన్నద్ధంగా ఉంది. అందుకే గల్వాన్‌లో చైనాను, డోక్లాంలో చైనాను నిలువరించింది. మోదీకి ఏమాట చెప్పినా ఒక్కటి వాస్తవం. ప్రపంచంలో శాంతి కావాలంటే శక్తి ఉండాలి శస్త్రం కావాలి.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
11.03.2026

ప్రపంచంలో మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా

ఈనాడు ప్రపంచ మేటి బౌలర్ కి ఒకనాడు ఒక గ్లాసు పాలు కూడా భోగమే అంటే ఆశ్చర్యం కలుగక మానదు. తన అత్యుత్తమ బౌలింగ్ ప్రతిభతో భారత్ కు చారిత్రాత్మక టి20 ప్రపంచ కప్ విజయాన్ని అందించడం ద్వారా అతను ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్ అని ఎందుకు పిలువబడ్డాడో మళ్ళీ నిరూపించుకున్నాడు. అయితే, అతని ప్రస్థానం మాత్రం పూలబాటతో ప్రారంభం కాలేదు.



యేచన్ చంద్ర శేఖర్
8885050822

గతంలో 2007 మరియు 2024లో టి20 ప్రపంచ కప్ గెలుచుకున్న భారతదేశం 2026 సంవత్సరపు టి20 ప్రపంచ కప్ ఛాంపియన్‌షిప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీని గెలుచుకోవడం ద్వారా సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రపంచంలోనే ఇప్పటి వరకు మూడు సార్లు టి20 ప్రపంచ కప్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న భారత క్రికెట్ జట్టు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. ఈ ట్రోఫీలో భారత జట్టు బౌలింగ్, బ్యాటింగ్ మరియు ఫీల్డింగ్లో అద్భుతంగా రాణించి సమిష్టి పోరాటపటిమను కనబరిచింది. 2026 టి20 ప్రపంచ కప్‌లో జస్ప్రీత్ బుమ్రా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా మరియు 6.21 ఎకానమీ రేట్‌తో 14 వికెట్లు పడగొట్టి, సంయుక్తంగా అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో 4 వికెట్లకు 15 పరుగులిచ్చి భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవడంలో సహాయపడినందుకు అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలోనే జస్ప్రీత్ బుమ్రా యొక్క గతం గురించి కొంత తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

జస్ప్రీత్ బుమ్రా గణాంకాలు:

జస్ప్రీత్ బుమ్రా ఒక ప్రీమియర్, ఎలైట్ ఫార్మాట్ ఫాస్ట్ బౌలర్. అసాధారణమైన, రికార్డుబ్రేకింగ్ గణాంకాలు అతని సొంతం. ఇందులో ప్రత్యేకించి 21 ఏళ్లలోపు టెస్ట్ సగటు, 25 ఏళ్లలోపు వన్ డే ఇంటర్నేషనల్ (ఒడిఐ) సగటు మరియు 500కు పైగా అంతర్జాతీయ వికెట్లు ఉన్నాయి. ఒడిఐ లలో 19 పరుగులకు 6 వికెట్లు మరియు టెస్ట్ లలో 27 పరుగులకు 6 వికెట్లు అతని అత్యుత్తమ గణాంకాలు. ఉపఖండంలో లాగా కాకుండా సవాళ్ళతో కూడి ఫాస్ట్ బౌలింగ్ కు అనుకూలించే సేనా (SENA - సౌత్ ఆఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజీల్యాండ్ మరియ ఆస్ట్రేలియా) దేశాలలో ఆయన 25 కన్నా తక్కువ సగటు రేటుతో ఆయన తన ఆధిపత్యం చెలాయించాడు. 4.17 ఎకానమీ రేటుతో 15 వికెట్లు కొల్లగొట్టి 2024 టి20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దక్కించుకున్న జస్ప్రీత్ 5 సార్లు ఐపిఎల్ ఛాంపియన్. ఐదు సార్లు ఐపిఎల్ టైటిల్ విజేత అయిన ముంబై ఇండియన్స్ జట్టులో (2013 అరంగేట్ర సీజన్, 2015, 2017, 2019 మరియు 2020) ఆయన కీలక సభ్యుడు. ముఖ్యంగా 2017, 2019 మరియు 2020 సీజన్లలో, అతను జట్టులో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 2024లో, అతను అద్భుతమైన సగటుతో 71 వికెట్లు సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్ లో ఐదు సార్లు 18 వికెట్లు పడగొట్టిన ఘనత అతని సొంతం కాగా అత్యధిక కెరీర్ వికెట్లలో 42వ స్థానంలో ఉన్నాడు. విదేశీ గడ్డపై టెస్ట్ విజయాలలో భారతదేశానికి అత్యుత్తమ బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఒకరిగా పరిగణించబడడం విశేషం. జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ ఆల్‌ఫార్మాట్ బౌలర్‌గా విస్తృతంగా పరిగణించబడ్డాడు. చాలా మంది క్రికెట్ నిపుణులు మరియు మాజీ ఆటగాళ్ళు ఈ తరం యొక్క ప్రీమియర్ ఫాస్ట్ బౌలర్‌గా అతనిని పేర్కొంటారు. అతను తన ఖచ్చితత్వానికి, అన్ని పరిస్థితులలోనూ ఆధిపత్యం చెలాయించే సామర్థ్యం, టెస్ట్ మరియు టి20 క్రికెట్ రెండింటిలోనూ కీలకమైన ప్రదర్శనలకు ప్రసిద్ధి చెందాడు.

కుటుంబ నేపథ్యం:

జస్ప్రీత్ బుమ్రా తల్లి పేరు దల్జిత్ బుమ్రా. ఆమె ఒక పాఠశాలలో రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్. బుమ్రాకు ఐదు సంవత్సరాల వయసులో అతని తండ్రి మరణించడంతో, ఆమె బుమ్రా సహా అతని సోదరిని ఒంటరిగానే పెంచి పెద్దచేసింది.



జస్ప్రీత్ తరచుగా తాను ప్రేరణ కోసం ఎక్కడికో వెళ్లవలసిన అవసరం లేదు, అది ఇంట్లోనే తన తల్లి రూపంలో దొరికింది అని తన తల్లే తనకు అతిపెద్ద ప్రేరణ అని చెబుతాడు. భర్త మరణంతో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న అతని తల్లి దల్జీత్ మొదట్లో జస్ప్రీత్ సాంప్రదాయ ఉద్యోగంతో స్థిరమైన జీవితం గడపాలని కోరుకున్నప్పటికీ, తన కొడుకుకు క్రికెట్ పట్ల మక్కువను గమనించి అతనిలో తన కలలను సాకారం చేసుకోగల సామర్థ్యం ఉందని నిర్ధారించుకుంది. ఆమె గతంలో వారు అనుభవించిన కష్టాలను తలచుకుంటూ మొట్టమొదటి సారి జస్ప్రీత్ ఐపిఎల్ మ్యాచ్‌లో ఆడటం టెలివిజన్‌లో చూసినప్పటి విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె ఎలా ఏడ్చారో భావోద్వేగంగా తెలిపింది. సాధారణంగా దల్జీత్ ఫోటోలు బహిరంగంగా అందుబాటులో లేనప్పటికీ, సోషల్ మీడియాలో బుమ్రా షేర్ చేసిన కుటుంబ ఫోటోలలో మరియు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి ఇచ్చిన ఇంటర్వ్యూలలో కనిపించారు.

ఒక గ్లాసు పాలు కూడా భోగమే ...

ఈనాడు ప్రపంచ మేటి బౌలర్ కి ఒకనాడు ఒక గ్లాసు పాలు కూడా భోగమే అంటే ఆశ్చర్యం కలుగక మానదు. తన అత్యుత్తమ బౌలింగ్ ప్రతిభతో భారత్ కు చారిత్రాత్మక టి20 ప్రపంచ కప్ విజయాన్ని అందించడం ద్వారా అతను ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్ అని ఎందుకు పిలువబడ్డాడో మళ్ళీ నిరూపించుకున్నాడు. అయితే, అతని ప్రస్థానం మాత్రం పూలబాటతో ప్రారంభం కాలేదు. కేవలం 5 సంవత్సరాల వయసులోనే అతను తన తండ్రిని కోల్పోయాడు. అతని తల్లి దల్జిత్, పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా 16 నుండి 18 గంటలు పనిచేస్తూ ఒంటరిగా ఇద్దరు పిల్లలను పెంచింది. జస్ప్రీత్ కు కేవలం ఒక జత బూట్లు మరియు ఒక జత టిషర్ట్ మాత్రమే వాటినే ఉతుక్కుని ధరించేవాడు. ఆమె ఎప్పుడు కూడా తన కొడుకును ఇంజనీరింగ్ లేదా మెడిసిన్ చదవమని వత్తిడి చేయాలేదు. జస్ప్రీత్ సాంప్రదాయ ఉద్యోగంతో స్థిరమైన జీవితం గడపాలని, తాను కన్న కలలను సాకారం చేసుకోవాలని కాంక్షించేవారు. అందుకు ఆమె తన సంపూర్ణ సహకారాన్ని అందించేదే తప్ప ఎప్పుడు ఆజ్ఞాపించేది కాదు. తీవ్రమైన ఆర్థిక వత్తిడిలోనూ అతని తల్లి యొక్క అచంచల విశ్వాసంతో, ఒకనాటి ఆ చిన్న పిల్లవాడు ఈనాడు భారతదేశం, కాదు కాదు ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా ఎదిగి భారత జట్టు మూడవ సారి టి20 ప్రపంచ కప్ విజయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.

కుటుంబ నేపథ్యం:

జస్ప్రీత్ బుమ్రా తండ్రి జస్బీర్ సింగ్ ఒక పారిశ్రామికవేత్తగా తన కుటుంబాన్ని పోషించేవారు. కాగా, జస్ప్రీత్ కు ఐదు సంవత్సరాల వయసులో హెపటైటిస్ సోకడంతో మరణించారు. భర్త మరణానంతరం, అతని తల్లి దల్జిత్ కౌర్ బుమ్రా, అతన్ని నేటి వ్యక్తిగా తీర్చిదిద్దడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. భర్త మరణం తర్వాత దల్జిత్ కౌర్ తన సంతానమైన జస్ప్రీత్ మరియు అతని అక్క జుహికాను ఒంటరిగా పెంచిన ఉక్కు సంకల్పం గల మహిళ. ఆమె అహ్మదాబాద్‌లోని నిర్మాణ్ హై స్కూల్‌లో వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేసారు. జస్ప్రీత్ తన అక్క జుహికా బుమ్రాతో అత్యంత సన్నిహిత బంధాన్ని పంచుకుంటాడు. వరుణ్ సెల్లీ అనే ఇంజనీర్‌ను వివాహం చేసుకున్న జస్ప్రీత్ అక్క జుహికా బుమ్రా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. తన సోదరితో సన్నిహిత బంధాన్ని పంచుకునే జస్ప్రీత్ ప్రతి సంవత్సరం ఆమెతో కలిసి రక్షా బంధన్ పండుగను వేడుకగా జరుపుకుంటాడు. జస్ప్రీత్ కుటుంబం, ముఖ్యంగా అతని తల్లి, అతని జైత్రయాత్రలో కీలక పాత్ర పోషించారు. అతని భార్య సంజన కూడా క్రీడా ప్రసారాలలో కెరీర్‌ను నిర్మించుకున్న సహాయక జీవిత భాగస్వామి. వ్యక్తిగతంగా వారిరువురు తమ తమ రంగాలలో విజయాలు సాధించినప్పటికీ, వారు తమ కుటుంబ జీవితానికి కూడా సమ ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం.

ఆదాయం:

జస్‌ప్రీత్ బుమ్రా నికర విలువ సుమారు 7 నుండి 8 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రు.60-95 కోట్లు ఉంటుందని అంచనా. బిసిసిఐ గ్రేడ్ ఏప్లస్ సెంట్రల్ కాంట్రాక్ట్, టెస్ట్ మ్యాచ్‌లు, ఒడిఐ మ్యాచ్‌లు, టి20 మ్యాచ్‌లు మరియు ఐపిఎల్ మ్యాచ్‌ల ద్వారా ఆయనకు పారితోషికం అందుతుంది. ఇవి కాకుండా ఎండార్స్‌మెంట్ డీల్స్, తదితరాల ద్వారా కూడా ఆయనకు ఆదాయం సమకూరుతుంది.

(వ్యాసకర్త మాజీ రాష్ట్ర కార్యదర్శి, ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ)

వెలుగుమట్లలో వినిపిస్తున్న 'మా భూమి' గర్జన



సంపతి రమేష్
7989579428.

భారతదేశ చరిత్ర, సంస్కృతి భూమితోనే ముడిపడి ఉంది. ఈ నేలపై జరిగిన ఎన్నో యుద్ధాలు, ఉద్యమాలు భూమి కోసం జరిగినవే. ప్రాచీన ఇతిహాసమైన మహాభారతంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన మహాయుద్ధం భూమి కోసమే జరిగింది. అలాగే తెలంగాణ చరిత్రలో ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారక్కల యుద్ధం కూడా భూమి, స్వాభిమానం, జీవనాధారం కోసం జరిగిన పోరాటమే. ఈ క్రమంలో తెలంగాణలో అణగారిన వర్గాలకు దేశంలో భూమి, సంపద, రాజ్యం కోసం ఒక బహుజన నాయకుడు బయలుదేరాడు. అతడే బీసీ ఎస్సీ ఎస్టీల విముక్తి ఉద్యమ సారధి డాక్టర్ విశారదన్ మహారాజ్. ఈ దేశ ప్రజలు భూమినీ స్వీయ అస్తిత్వానికి, ఆత్మగౌరానికి, ఆర్థిక భద్రతకు ప్రతీకగా చూస్తారు. తెలంగాణ ప్రాంతం భారతదేశ చరిత్రలో భూమి-బుక్తి-విముక్తి పోరాటాలకు కేంద్రబిందువుగా నిలిచింది. ఒకవైపు భూమీ కోసం పోరాటం, భూదాన ఉద్యమం ఇక్కడినుంచే జరిగింది. ఆ భూదాన్ ఉద్యమం ఫలితంగా అక్కడక్కడ కొంత మంది పేదలకు భూములిచ్చారు. కానీ పేదల కోసం ఇవ్వబడిన ఆ భూదాన్ భూములు నేడు మళ్లీ ఆక్రమణలకు గురవుతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో, వెలుగుమట్ల ప్రాంతంలో జరిగిన సంఘటనలు ఇందుకు నిదర్శనం. పేదలకు ఇచ్చిన భూదాన్ భూములను కొంతమంది ఆధిపత్య వర్గాలు ఆక్రమించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఆ భూములపై పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం వల్ల తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెలుగుమట్ల గ్రామంలో 62 ఎకరాల భూమి భూదాన్ బోర్డు పరిధిలోని భూమి. ఇందులో ప్రస్తుతం ఉన్న 31 ఎకరాల్లో పేదలు ఇల్లు కట్టుకున్నారు. అక్రమ కట్టడాల పేరుతో దాదాపు వెయ్యి ఇళ్లు నేలమట్టం చేశారు. 1950 లో ఏర్పడ్డ భూదాన్ బోర్డ్ పరిధిలోని భూములకు చట్టప్రకారం ప్రభుత్వం యజమాని కాదు. ఇదీ పేదలకే చెందాలి. ప్రభుత్వ చర్య వలన నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో వాతావరణం రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలు ఒక్కసారిగా నిరాశ్రయులుగా మారారు.

భూమి పంపిణీలో తీవ్ర అసమానతలు.

ఎవరికైనా భూమి ఉంటే వారు స్వతంత్రంగా జీవించగలరు. అందుకే ఈ దేశంలో భూ పంపిణీ సామాజిక న్యాయంతో ముడిపడి ఉంటుంది. కానీ ఇప్పటికీ ఈ దేశంలో భూమి సమానంగా పంపిణీ జరగలేదు. కొంతమంది ఆధిపత్య వర్గాలు తరతరాలుగా భూమిని సంపాదించగా, మరికొన్ని వర్గాలు భూమి లేని కూలీలుగా మిగిలిపోయాయి. నేటికీ దేశంలో అత్యధిక బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు చిన్న రైతులుగా, కౌలు రైతులుగా, రైతు కూలీలుగా జీవిస్తున్నారు. భారతదేశంలో, తెలంగాణలో



భూమి పంపిణీ తీవ్ర అసమానంగా ఉంది. తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 2025 శాతంలేని ఓసీలకు సుమారు 35 నుంచి 40శాతం భూమినీ కలిగి ఉన్నారు. గిరిజనులకు మినహా బీసీ, ఎస్సీలకు తమ జనాభా స్థాయిలో భూమి లేకపోవడం గమనార్హం. భూమి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైనదని స్పష్టమవుతుంది. ఇప్పటికీ మెజార్టీ అట్టడుగు ప్రజలు భూమిలే నిరుపేదలుగా, వ్యవసాయ కూలీలుగా, వలస కార్మికులుగా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. దళిత కుటుంబాలలో సగానికి పైగా కుటుంబాలకు స్వంత భూమి లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. నాటి భూదాన్ ఉద్యమం నుంచి గత ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ వల్ల జరిగిన లబ్ధి అంతంత మాత్రమే. చారిత్రకంగా భూమి కోసం ఎన్నో పోరాటాలు జరిగిన తెలంగాణ నేలపై వెలుగుమట్ల భూదాన్ భూమి సమస్యపై సమాజంలోని ఆందోళన మొదలైనది. పేదల హక్కుల కోసం పోరాడామని చెప్పుకునే కమ్యూనిస్టు నాయకులు కూడా ఈ విషయంలో బహిరంగంగా స్పందించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిస్థితుల్లో పేదల పక్షాన గళమెత్తిన వ్యక్తి డాక్టర్ విశారదన్ మహారాజ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంయుక్తంగా వెలుగుమట్ల భూదాన భూములపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారు నిరవధిక దీక్ష చేపట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

భూదాన్ ఉద్యమం బూటకమా?

78 వసంతాల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికి పేదల భూమి దున్నడం మాత్రమే తప్పా, ఆ భూమి యజమాన్యం మాత్రం వారి చేతుల్లో లేదనీ రుజువవుతుంది. అసలు భూదాన్ - నిజమా? బూటకమా? ఒకప్పుడు భూదాన్ పేరుతో భూములు పేదలకు ఇస్తామని చెప్పారు. మరి ఇప్పుడు వెలుగుమట్లలో పేదలకు ఇచ్చిన భూములు నిజంగా వారి చేతుల్లో ఉన్నాయా? లేదా కాగితాల మీద మాత్రమే ఇచ్చారా? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇప్పటికి రాష్ట్రంలో దళిత, గిరిజనులకు ఇచ్చిన అసైన్ భూముల విషయంలో పలు వివాదాలు నెలకొన్నాయి. అ భూములను ఆధిపత్య వర్గాలు ఆక్రమించుకోవడం, వాటి కోసం అణగారిన వర్గాల పోరాటం ఒక సామాజిక ఘర్షణకు దారితీస్తుంది. ఆనాడు గాంధీ భూమి విషయంలో అత్యధికంగా భూమీ ఉన్న వాళ్ళ నుంచి భూమిలేని నిరుపేదలకు దానంగా ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో గాంధీ అనుచరుడు ఆచార్య వినోబాభావే ఈ భూదానోద్యమానికి శ్రీకారం చుట్టాడు. కానీ ఇది విజయవంతం కాలేకపోయింది. అంబేద్కర్ మాత్రం రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా నిరుపేదలకు భూమిని పంచాలన్నాడు. అనంతరం భూగరిష్ట పరిమితి చట్టాలు చేసినప్పటికీ, అట్టడుగు వర్గాలకు భూమి చెందలేదు. అంతేకాక ఇప్పటికీ వారికి జనాభా ప్రకారం సంపద, రాజ్యంలో వాటా లేదు. ఈ క్రమంలో దేశంలో సమస్త భూమి, సంపద, రాజకీయాల్లో బీసీ ఎస్సీ ఎస్టీల వాటా కోసం "మా భూమి" పేరుతో డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల రథయాత్రకు పిలుపునిచ్చాడు. ఇదీ దేశ స్వాతంత్రం ఉద్యమం, తెలంగాణ ఉద్యమం తర్వాత జరుగుతున్న మహత్తర బహుజన పోరాటం. ఈ పోరాటం ఇప్పుడు వెలుగుమట్ల భూదాన్ బాధితుల పక్షాన న్యాయం కోసం నిలబడింది. వారికి అండగా డాక్టర్ విశారదన్ మహారాజ్, కల్వకుంట్ల కవిత నిలబడ్డారు. కావున పౌర సమాజం, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వారికి మద్దతుగా నిలవాలి. నిజంగా పేదలకు భూములు చెందాలంటే ప్రభుత్వమే చట్టపరంగా పట్టాలివ్వాలి. ఇది ప్రభుత్వాల నైతిక బాధ్యత కూడా. లేదంటే ఈ భూగర్జనలు, భూ పోరాటాలు ఆగవు.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)



చదువుకుందాం రా... చదివిద్దాం పద



మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి గురించి మనం తరచుగా మాట్లాడుతుంటాం. రోడ్లు కావాలి, ఆసుపత్రులు కావాలి, సౌకర్యాలు కావాలి అని కోరుతుంటాం. కానీ ఈ అభివృద్ధికి అసలు బలం ఇచ్చేది ఒకటే - చదువు. చదువు ఉన్నప్పుడే వ్యక్తి జీవితం మారుతుంది, కుటుంబం ఎదుగుతుంది, గ్రామం అభివృద్ధి చెందుతుంది.ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా ప్రతిభావంతమైన పిల్లలు ఉన్నారు. కానీ దురదృష్టవశాత్తు వారిలో చాలామంది పదవ తరగతి కూడా పూర్తిచేయకుండా మధ్యలోనే చదువు మానేస్తున్నారు. కొందరు కుటుంబ పరిస్థితులు కారణంగా, కొందరు ఆసక్తి లేక, మరికొందరు సరైన మార్గదర్శకత్వం లేక చదువును వదిలేస్తున్నారు.

చదువు మానేస్తున్న పౌరులు...
చీకటిలోకి వెళ్తున్న భవిష్యత్తు

ఇలా చిన్న వయసులోనే చదువు మానేయడం వల్ల భవిష్యత్తు అవకాశాలు చాలా వరకు తగ్గిపోతాయి. చదువు లేకపోతే మంచి ఉద్యోగం దొరకడం కష్టం. సమాజంలో గౌరవంగా నిలబడే అవకాశం కూడా తగ్గిపోతుంది. చిన్నతనంలో తీసుకునే ఈ నిర్ణయం జీవితమంతా ప్రభావం చూపుతుంది.మరొక విచారకరమైన విషయం ఏమిటంటే, కొంతమంది ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదివినా ఆ చదువును ఉపయోగపడే దిశగా తీసుకెళ్లడం లేదు. ఉద్యోగాల కోసం ప్రయత్నించకుండా, లక్ష్యాలు లేకుండా కాలాన్ని వృథా చేసుకుంటున్నారు. చదువు అనేది కేవలం సర్టిఫికెట్ కోసం కాదు; అది మన జీవితాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గం.

చదువు ఉన్నా లక్ష్యం లేకపోతే
ప్రయోజనం ఏమిటి.?

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదవాలి. డాక్టర్ కావాలి, టీచర్ కావాలి, పోలీస్ కావాలి, అధికారి కావాలి, లేదా ఏదైనా నైపుణ్యం నేర్చుకుని మంచి జీవితం గడపాలి అనే ఆలోచన ఉండాలి. చదువు అంటే కేవలం పుస్తకాలు చదవడం కాదు, మన భవిష్యత్తును నిర్మించుకోవడం.తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపాలి. చిన్న పనుల కోసం పిల్లలను చదువు మానేయకుండా ప్రోత్సహించాలి. గ్రామంలో ఉన్న పెద్దలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు కలిసి పిల్లల్లో చదువుపై అవగాహన కల్పించాలి.ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మొదటగా పిల్లలు చదవాలి.చదువు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి, ఆర్థిక స్థితి మెరుగవుతుంది, సమాజంలో గౌరవం పెరుగుతుంది.

(వ్యాసకర్త జర్నలిస్ట్, గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

అన్నారం రైతుల కోసం అవసరమైతే ఆమరణ దీక్ష

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రియల్ ఎస్టేట్ ఏజెంట్ గా వ్యవహరిస్తున్న టీజీఐఐసి, రాష్ట్ర ప్రభుత్వం
- ఆరుగాలం పండే భూములను ఆగ మాగం చేస్తున్నారు
- అన్నారం సర్వే నంబర్ 261లో గజం భూమిని సైతం కోల్పోనివ్వం
- మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో ప్రతి రైతుకు పాస్ బుక్కులు అందిస్తే - నేడు అంగట్లో వేలం వేస్తున్నారు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం గ్రామ పరిధిలోగల సర్వేనెంబర్ 261 లోని 580 ఎకరాలలో ఆరుగాలం పంటలు పండి రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న పచ్చని భూములను నేడు రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసి సంస్థలు రియల్ ఎస్టేట్ ఏజెంట్లా వ్యవహరిస్తూ అంగట్లో కూరగాయల్లాగా అమ్మకాలు చేపడుతోందని రైతు వ్యతిరేక నిర్ణయాలను విరమించుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష సైతం చేపడుతామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి అన్నారం పరిధిలోని సర్వే నంబర్ 261లో గల వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పేరుతో చేపడుతున్న ఆగడాలను రైతులు స్వయంగా ఎమ్మెల్యే కు స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు గతంలో సర్వేనెంబర్ 261 లో వ్యవసాయ భూములకు సంబంధించిన 117 మంది రైతుల వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో చేర్చడంతో పాటు పాస్ బుక్కులు సైతం అందించడం జరిగిందని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ప్రతి రైతు తన కుటుంబంతో కలిసి కష్టపడుతూ పంటలు పండిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీఐఐసి తో కలిసి రియల్ ఎస్టేట్ ఏజెంట్లా వ్యవహరిస్తూ.. పేద, సన్నకారు, మధ్యతరగతి వ్యవసాయ భూములను పరిశ్రమలకు కేటాయిస్తున్నామన్న పేరుతో బడా కంపెనీలకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు దారదత్తం చేస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 261 లో గల 580 ఎకరాలను ప్రైవేటు పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పనంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజా అవసరాల కోసం రైతులను ఒప్పించి మెరుగైన నష్టపరిహారం అందించి తీసుకోవడం దేశవ్యాప్తంగా జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం రైతులను బెదిరించి అక్రమంగా, అన్యాయంగా పచ్చని పంట భూమలను లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నారం భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే వేలాది మంది రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు సెక్రటేరియట్ ను ముట్టడించడంతోపాటు ఆమరణ నిరాహార దీక్ష సైతం చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా అందించారు.



మహిళలు ఎదిగిన రోజే ఈ సమాజం ఎదుగుతుంది

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 : సంగారెడ్డి పట్టణం లోని 23 వ వార్డులో కూన గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు నిర్మలా జగ్గారెడ్డి ని ఘనంగా సన్మానించారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగిన రోజే ఈ సమాజం ఎదుగుతుందని అన్నారు. సమాజం లో ప్రతీ మహిళా తనకంటూ ఒక గుర్తింపు ను కలిగి ఉండాలని, కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడం తో పాటు వ్యక్తిగతంగా తన అభిరుచి కి తగ్గట్టు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, యువజన సంఘాల నాయకుడు కూన వేణు, కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 10 : మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మరియు టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలరన్నారు. ఒకప్పుడు కంటే ఇప్పుడు పబ్లిక్ సర్వీసుల్లో మహిళా ఉద్యోగులు, ప్రజాసేవలో మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రత్యేకతను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు దూరదృష్టి ఎక్కువగా ఉంటుందని, పనులను క్రమబద్ధంగా నిర్వహించే సామర్థ్యం మహిళలలో ఎక్కువగా ఉంటుందని అన్నారు. మహిళలకు ప్రోత్సాహం కల్పించి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తే అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించ గలరన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను అన్ని విధాల ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాములను చేస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ పూర్తి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే మహిళలు తమ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళల ఉన్నతి సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పురుషులు సమానులని అన్నారు. పిల్లలకు మొదటి గురువు తల్లేనని, ఆడ మగ అన్న తేడా లేకుండా పిల్లలను క్రమశిక్షణతో పెంచి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిపైనే ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మహిళల్లోనే మార్పు రావాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందుతున్నాయని తెలిపారు. మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు సంబంధించిన పలు చట్టాల గురించి ఆమె వివరించారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు మేమెంటో, సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు న్యూట్రిషన్ కిట్స్ అందజేశారు. అంతకుముందు పలువురు వక్తలు మహిళా దినోత్సవం ప్రాముఖ్యతపై ప్రసంగించగా, బాలసదనం విద్యార్థులు, అంగన్వాడి టీచర్లు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, డిడబ్ల్యూఓ లలిత కుమారి, డిఆర్డీవో జ్యోతి, జిల్లా అధికారులు, డిఎంఅండ్‌హెచ్ఓ, సీడీపీవోలు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా క్రీడోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజక వర్గ కేంద్రం లోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా క్రీడోత్సవాలను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రెండు రోజులపాటు నియోజకవర్గ స్థాయి మహిళా క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని, మార్చి 12వ తేదీన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వేలాదిమంది మహిళలతో మహిళా దినోత్సవ వేడుకలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్రీడలలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్



ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , మార్చి10 : సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి నియోజక వర్గంలోని విద్యా రంగ అభివృద్ధిపై సంక్షేమ శాఖ అధికారులు టీజీ ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులు,ప్రిన్సిపాల్స్ ,ఆర్ సి ఓల తో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన కొత్త తరగతి గదులు, భవనాలు, కాంపౌండ్ వాల్స్ ,మరుగుదొడ్లు, ఆర్.ఓ. త్రాగునీటి ప్లాంట్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ లోపు సంబంధిత శాఖలు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పరిశ్రమల సహకారం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో, ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతుల నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అద్దె భవనాల్లో నడుస్తున్న వసతి గృహాలను సొంత భవనాల్లోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలోని మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలలు, కళాశాలల్లో తగిన భద్రతా చర్యలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న కళాశాలలు, వసతి గృహాల వివరాలను సేకరించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భముగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా అభివృద్ధికి పరిశ్రమల సహకారం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలోపరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వినియోగించి కొత్త హాస్టల్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా సురక్షితమైన వసతి గృహాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించటానికి అధికారులు కృషిచేయాలని తెలిపారు . జిల్లాలో విద్యనభ్యసించేందుకు ఇతర ప్రాంతాల నుండి కూడా అనేక మంది విద్యార్థులు సంగారెడ్డికి వస్తున్నారని, అందువల్ల విద్యాసంస్థల వద్ద తగిన మౌలిక వసతులు, వసతి సదుపాయాలు కల్పించడం అత్యవసరమని తెలిపారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆమె తెలిపారు . ఈ కార్యక్రమంలో సిపిఓ బాలశౌరి, సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, పంచాయతీరాజ్ ఎస్సీ జగదీష్, ఈ డబ్ల్యూ ఐ డి సి రాజు, శ్రీనివాస్ రెడ్డి,, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్,సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రి బాయి ఫూలే మహిళలకు ఆదర్శం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ మార్చి 10 నేటి మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక సావిత్రి భాయి పూలే అని,ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాయికోడ్ గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ అన్నారు. సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతి సందర్భంగా రాయికోడ్ గ్రామం సావిత్రి బాయి పూలే జ్యోతి రావు పూలే విగ్రహాల వద్ద ఆమె విగ్రహానికి గ్రామస్తులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే త్యాగాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతి మహిళ అలవర్చుకోవాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తున్నారంటే అది సావిత్రిభాయి పూలే ఆనాడు వేసిన సాహసోపేతమైన పోరాటంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో గ్రామ డిప్యూటీ సర్పంచ్ మ్యాతరి గోపాల్, పంచాయతి కార్యదర్శి రమేష్,గ్రామస్తులు కొండా నరసింహా స్వామి,మందీపుల నారాయణ రెడ్డి,రాజు వార్డు మెంబర్,మేస్త్రిఖాజా,హన్మన్న,సయ్యద్ ఖాజా మైనోద్దీన్,పుల్లరి రాజు,మేస్త్రి భీమేశ్,ఉప్పరి రవి కుమార్, యన్ నరసింహా,రామాంజనేయులు గౌడ్, మైబు,ఎద్దుల రవి,యువకులు శివ శంకర్,ఎం అనీల్,కే చింటూ,నరసింహా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ హక్కులను తొలగిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఉపాధి హామీ రక్షణకై ఈనెల 20న చలో కలెక్టరేట్
- సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 : కేంద్ర ప్రభుత్వం రైతు, కూలీల హక్కులను తొలగించి, అంబానీ, ఆగానీలకు ఊడిగం చేసే పద్ధతులు మానుకోవాలని సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం, యాదగిరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 సంవత్సరం నుండి దేశ ప్రజలపై,కార్మిక, రైతు కూలీలపై ఆర్థిక భారాన్ని మోపుతూ అంబానీ,ఆదానీలకు ఊ డిగం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు 16 లక్షల కోట్లు మాఫీ చేసిన ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు 3 లక్షల కోట్లు బడ్జెట్ పెట్టడానికి ఎందుకు వెనకాడిందని ప్రశ్నించారు. దేశ ప్రజానీకంపై ధరలు పెంచుతూ, పన్నులను వసూలు చేస్తూ ఆర్థిక భారాన్ని మోపుతుందని అన్నారు.కార్మికులకు హక్కుగా ఉన్నటువంటి 29 కార్మిక చట్టాలను మారుస్తూ యాజమాన్యాలకు వత్తాసు పలికిందని, ఉపాధి హామీ కార్మికులకు 125 రోజులు పని దినాలు కల్పిస్తామని 3 లక్షల కోట్లు బడ్జెట్ పెట్టాల్సింది పోయి 95 వేల కోట్లు మాత్రమే కేటాయించారని బడ్జెట్ ను సవరించి 3 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధరలను పెంచుతూ ప్రజలందరి పై బారాలు మోపుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని సమస్త ప్రజానీకం ఫిబ్రవరి ఈనెల 20న జరిగే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి హక్కులను సాధించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బి, శ్రీనివాస్, నాయకులు రాజు సునీత, లక్ష్మమ్మ, మల్లేశం, వీరేశం రాజేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 10: నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్వ లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక రోజు పాటు పాఠశాల పరిపాలన బాధ్యతలను స్వయంగా నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సన ఒక రోజు కలెక్టర్‌గా, కల్పన డి.ఇ.ఓగా, రేణుక ఎం.ఇ.ఓగా విధులు నిర్వర్తించారు. అలాగే సాయికీర్తి మరియు పూజ జి.హెచ్.ఎంలుగా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా సుమారు 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు ప్రతిరోజూ పాఠాలు బోధించే సమయంలో ఎదుర్కొనే సమస్యలు, అనుభవాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తరగతి గదిలో క్రమశిక్షణ పాటించడం, పాఠాలను స్పష్టంగా వివరించడం వంటి అంశాలను అనుభవించడం ద్వారా ఉపాధ్యాయుల కష్టాన్ని వారు అర్థం చేసుకున్నారు. ఈ అనుభవం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో చదువుకొని మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి సునిత గారు, సీనియర్ ఉపాధ్యాయులు మధుసూదన్, మన్యం, మల్లేష్,రాజు, ప్రకాష్, శ్రీనివాసులు, విజయ్ కుమార్, అబ్దుల్ సలీం, సురేష్, యాదమ్మ, స్వరూప ,స్నేహ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



హార్ముజ్ జలసంధి ద్వారా జరిగే ఆయిల్ సప్లైని నిలిపివేసేందుకు యత్నిస్తే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పటి వరకు జరిగిన దాడుల కంటే 20 రెట్ల బలంతో విరుచుకుపడతాం. తిరిగి కోలుకోలేని స్థాయిలో ఇన్‌ఫ్రాను ధ్వంసం చేస్తాం. అయితే అలాంటి పరిస్థితి రాబోదని ఆశిస్తున్నా. చైనా సహా హార్ముజ్‌పై ఆధారపడిన దేశాలకు తానిచ్చే గిఫ్ట్ ఇదే.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రాంతీయం



ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

ప్రతిపక్షం, గుండాల, మార్చి 10: గుండాల మండలంని కొమ్ముగూడెం గ్రామంలో ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ పామ్ పంటపై అవగాహన, సాగు ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు రైతులకు ఆయిల్ పామ్ పంట ప్రాధాన్యత, సాగు విధానం, అధిక దిగుబడులు పొందే పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు.ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందవచ్చని అధికారులు తెలిపారు. మొక్కల నాటడం నుంచి పంట కోత వరకు పాటించాల్సిన పద్ధతులు, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుతం మార్కెట్ లో డిమాండ్ ఉన్న బొప్పాయి, అరటి, తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, పూలు, తైవాన్ జామ, నిమ్మ, కరివేపాకు, బోడ కాకర, తీగ చిక్కుడు, మునగ, నేరేడు, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, కోకో, వక్క, జాజికాయ వంటి పంటలను నూతన రకాలతో సాగుచేస్తే ఎకరానికి లక్ష రూపాయల వరకు నికర ఆదాయం పొందే అవకాశం ఉందని అధికారులు వివరించారు.కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ సాగును విస్తరించి ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను పొందాలని అధికారులు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం గ్రామ సర్పంచ్ కల్తి కృష్ణవేణి, జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి జంగ కిషోర్, ఉద్యాన అధికారి డి. దేవప్రసాద్, ఆయిల్ ఫైడ్ ప్రతినిధులు ఎస్. శంకర్, వికాష్, ఉపేందర్, కోరమండల్ సంస్థ ఉద్యోగులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.





తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి
- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చ్ 10: గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంపై మండల స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులతో మంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు, కొనసాగుతున్న పనుల పురోగతిపై అధికారులు వివరాలు అందజేశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పది ముఖ్య అంశాలతో రూపొందించిన ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాలలో కాకతీయ మెడికల్ కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్న వాటిని త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన కొంతమంది లబ్ధిదారులు ఇంకా మార్కింగ్ చేయించుకోలేదని, వారు వెంటనే మార్కింగ్ చేసుకుని పనులు ప్రారంభించాలని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సర్పంచులు, గృహనిర్మాణ శాఖ ఏఈలు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఏప్రిల్ లో మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. అదేవిధంగా 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో విద్య ద్వారానే వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోగలడని తేలిందని పేర్కొన్నారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటిని మరింత బలోపేతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. త్వరలో సర్పంచులు, ఉపసర్పంచులకు హెల్మెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు 99 రోజులపాటు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానాలను జిల్లా పరిషత్ సీఈవో శేషాద్రి వివరించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎస్ఈ చలమారెడ్డి, డీఈ గాయత్రి, డీఈవో గిరిరాజ్ గౌడ్, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, రవాణా శాఖ డిటిసి సురేష్ రెడ్డి, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, పాలక మండలి చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఎల్కతుర్తిలో జెండర్ రిసోర్స్ భవనం ప్రారంభం అనంతరం ఎల్కతుర్తిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన జెండర్ రిసోర్స్ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని అన్నారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే ఉద్దేశంతో మహిళా సంఘాల ద్వారా స్టీల్ బ్యాంకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజాపాలన ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, ఇతర అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

- తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ప్రతిపక్షం గుండాల, మార్చి 10: సాగునీటి బోర్లకు 24 గంటల త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం గుండాల మండలంలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ),సిపిఎం,ఏఎస్పీ,మాస్ లైన్, బిఆర్ఎస్, తుడుందెబ్బ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.ఏఏఎస్పీ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రం అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు, గుండాల సర్పంచ్ కోరం సీతారాములు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, మాస్ లైన్ మండల నాయకుడు పూనెం మంగయ్య, తుడుం దెబ్బ నాయకుడు గోవింద నర్సింహారావు తదితరులు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ కోతలు, లో వోల్టేజ్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రస్తుతం మొక్కజొన్న పంట కీలక దశలో ఉండగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. లో వోల్టేజ్ కారణంగా వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతున్నాయని, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇస్తామని ప్రకటించినప్పటికీ గుండాల మండలంలో సరఫరా సక్రమంగా లేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. అదేవిధంగా సబ్ స్టేషన్ల నిర్మాణానికి రైతులే భూములు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.అనంతరం రైతులు తమ సమస్యలపై తహసీల్దార్ ఖాసిం కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ రెండు రోజుల్లో మొక్కజొన్న రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందేలా పై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం మండలంలో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. దీనితో రైతులు ధర్నాను విరమించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తోలెం గోపి, ఊకే వెంకటేశ్వర్లు, జోగ రాజేష్, దుగ్గి రామ్మూర్తి, దుగ్గి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు ఈసం మంగయ్య, పెండకట్ల పెంటయ్య, ఐపిటిఇ నాయకులు యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, లాలు, తాటి రమేష్, ముత్తాపురం సర్పంచ్ కల్తీ రాధ, పడగోనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, ఏఎస్పీ నాయకులు పూనెం రమణారావు, గొగ్గెల సుధాకర్, మాస్ లైన్ నాయకులు ఊకే బాబు, పూనెం లక్ష్మయ్య, బిఆర్ఎస్ నాయకులు గడ్డం వీరన్న, తాటి పాపారావు, వాగబోయిన నర్సింహారావు, కల్తీ శేఖర్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మృతి

ప్రతిపక్షం, కామారెడ్డి, మార్చి 10: మెదక్ జిల్లా తూప్రాన్ మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి మరణించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా ఉన్న ఆయన అకస్మాత్తుగా మరణించడంతో రామారెడ్డి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన మోహన్ రెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన రాజకీయాల్లో చాలా చురుకుగా ఉండి, సమస్యలపై వెంటనే స్పందించేవారు.



ఎండాకాలం రాకముందే నీటికి కటకట

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 10: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని హసన్ పర్తి 66వ డివిజన్ లో గత నాలుగు రోజులుగా మంచినీరు రాకపోవడంలో మహిళలు పెద్ద ఎత్తున హసన్ పర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మహిళలు ఖాళీ బిందెలతో పెద్ద ఎత్తున వందల సంఖ్యలో ప్రధాన రహదారిపై వచ్చి రాస్తారోకో నిర్వహించడం మూలాన వందల సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.ఎన్నిసార్లు కార్పొరేటర్ విన్నవించిన ఫలితం లేకపోయేసరికి మహిళలు రోడ్డు మీది కి కలిసి వచ్చింది చాలా కుటుంబాలు వేసవి కాలంలో కావడం వలన నీటికి ఇబ్బందులు కాగా ఒక్క రోజు తప్పించి ఒక్కరోజు మరుసటి రోజు నాళాలు తక్కువ సమయానికి వదిలిపెట్టి గత వారం పది రోజులుగా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు ఈ విషయమై రాజకీయ నాయకులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా ఉండడం కనీసం పట్టించుకోకపోవడం వలన ప్రజలను బందులకు గురిచేస్తుంది వెంటనే హసన్పర్తి ఎస్సై దేవేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళలకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేశారు దానితో మహిళలు శాంతించి వెనుతిరిగి వెళ్లిపోయిన సంఘటన హసన్ పర్తి జరిగింది.





తెలంగాణ ఉద్యమకారుడు

కంచెట్టి గంగాధర్ మృతి

- కన్నీళ్లు పెట్టుకున్న ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి
- అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, బ్యూరో, నిజామాబాద్, మార్చి 10 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కంచెట్టి గంగాధర్ అనారోగ్యం తో మంగళవారం ఉదయం మృతి చెందారు. అనారోగ్య సమస్యలతో మరణించిన కంచెట్టి గంగాధర్ అంత్యక్రియలను మంగళవారం సాయంత్రం డిచ్ పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో నిర్వహించగా ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పాల్గొని ఆయన మృతదేహానికి వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంత్యక్రియలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. గంగాధర్ తమ మధ్య లేరన్న మాట తీవ్రంగా కలిచివేస్తుందని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. అనంతరం సాగిన చివరి మజిలీలో కంచెట్టి పాడే మోసి ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా చివరి మజిలీలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ. 25ఏళ్లుగా వ్యక్తిగతంగా, రాజకీయంగా అత్యంత సన్నిహితుడుగా ఉన్న గంగాధర్ మరణించడం బాధగా ఉందన్నారు. తన గెలుపులో ఆయన పాత్రే కీలకంగా ఉందని, కన్నీరు పెట్టుకున్నారు. ముక్కుసూటిగా, నిఖార్సైన రాజకీయాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంచెట్టి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో ఉద్యమకార్యచరణతో పనిచేసి, స్వరాష్ట్రం సాధించడంలో ఆయన పాత్ర కూడా ఎనలేనిదని స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, డిచ్ పల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమృత పూర్ గంగాధర్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపెల్లి సాయిరెడ్డి, డిచ్ పల్లి సొసైటీ చైర్మన్ రామచందర్, జిల్లా నాయకులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఏఐ' ద్వారా జీవన ప్రమాణాలను పెంపొందించాలి

- తెలంగాణ వర్సిటీ వీసీ ఆచార్య టి యాదగిరిరావు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 10 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో వినియోగించాలని వర్సిటీ ఉపకులపతి ఆచార్య యాదగిరిరావు అన్నారు. మంగళవారం తెలంగాణ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రారంభమైన చాగంటి డెవలప్మెంట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ ద్వారా పురోగతి దేశ పురోగతికి బాటలని కావున విద్యార్థులు మేధావులు ఈ రంగాలలో అవిరాల కృషి సల్పి దేశ భవిష్యత్తుకు పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ రిసోర్స్ పర్సన్ నివాస్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ సంస్థ ఏఐను విద్యతో అనుసంధించడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. టాస్క్ సత్యం మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యం పెంచడానికి టాస్క్ ఎల్లవేళలా కృషిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి, వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హారతి, డాక్టర్ అతిక్, డాక్టర్ నందిని, డాక్టర్ భ్రమరాంబిక, నీలిమ పాల్గొన్నారు.



ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలంలో స్టూడెంట్ ఔట్రీస్ ప్రోగ్రాం

ఏకపంట ఆధిపత్యం నుండి సమగ్ర వ్యవసాయ వ్యవస్థల వైపు మారడం" అనే అంశంపై ఒక రోజు విద్యార్థుల అవగాహన చేరిక కార్యక్రమం (స్టూడెంట్ ఔట్రీచ్ ప్రోగ్రాం) బ్రోచర్ ను తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టి.యాదగిరి రావు గారు ఆవిష్కరించారు. బీతెలంగాణ విశ్వవిద్యాలయం అప్లైడ్ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో "బహుళ పంటల సమ్మేళన వ్యూహం జరిగింది. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ స్వప్న మాట్లాడుతూ ఈ కార్యక్రమం బహుళ పంటల సమ్మేళనం ద్వారా రైతులు, వ్యవసాయ రంగ అభివృద్ధి ఎలా జరుగుతుందో విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పొందే అవకాశం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్మూర్ మండలం గోవింద్ పేట గ్రామంలో వచ్చే నెలా ఏప్రిల్ 8న నిర్వహించబడుతుందని ఆమె పేర్కొన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్.స్వప్న, చైర్మన్ ప్రొఫెసర్ కె. రవీందర్ రెడ్డి, యూజీసీ సెల్ డైరెక్టర్ మరియు బిజినెస్ మేనేజ్మెంట్ ఆచార్య సిహెచ్ ఆంజనేయులు, డాక్టర్ పాత నాగరాజు డాక్టర్ టి సంపత్ పాల్గొన్నారు.



పీఎంజేడీవైతో సహా 72 కోట్ల బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్స్‌కు కనీస నిల్వ నిబంధన లేదు. వీటికి మినిమం బ్యాలెన్స్ లేకపోయినా ఫైన్ ఉండదు. డిపాజిట్, విత్‌డ్రా, ఏటీఎం సేవలకూ ఛార్జీలు ఉండవు. అందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సదుపాయాన్ని కల్పించాం.
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

హిందువుల మనోభావాలను రెచ్చగొడుతున్నారు

- హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా సీఎం మంత్రులు ఎందుకు స్పందించడం లేదు
- శివాలయంలో విగ్రహాల దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ డిమాండ్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 10 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హిందూ ఆలయాలపై, హిందూ దేవతా మూర్తులపై దాడులు జరగడం హేయమైన చర్య అని, ఈ దాడులకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గోపాల్ బాగ్ శివాలయం లో ధ్వంసం అయిన విగ్రహాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు హిందూ ఆలయాలను టార్గెట్ చేసుకొని హిందూ ఆలయాలు, హిందూ దేవతా విగ్రహాలపై దాడులు జరగడాన్ని హిందువులందరూ గమనిస్తున్నారని, ఒక్కసారి కాషాయ దళం రెచ్చిపోతే జరిగే నష్టానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వారితో పాటు లా అండ్ ఆర్డర్ ను కాపాడాల్సిన పోలీసులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. నగర శివార్ గోపాల్ బాగ్ లో పురాతన శివాలయం పై గత మూడు రోజుల క్రితం జరిగిన ఈ విగ్రహాల ధ్వంసం ఘటనపై పోలీసులు కనీసం నిందితులను పట్టుకోవడంలో వైఫల్యం చెందారని అన్నారు. ఈ 80 ఎకరాల గోశాల స్థలంలో కొందరు ముస్లింలు కబ్జాలకు కూడా పాల్పడ్డారని దీనిపై వెంటనే కలెక్టర్ రెవిన్యూ సిబ్బంది స్పందించి ఈ కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ముస్లింల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అందుకే హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా వారి నోటి నుండి ఎలాంటి స్పందన రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలు రోజురోజుకు రెచ్చిపోతున్నారని హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ అధికారిక యంత్రాంగంతో వీటిని నియంత్రించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా నిఘా పెట్టి ఇకపై ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని లేకపోతే జరగబోయే నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ భద్రతా వ్యవస్థనే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ లు పాల్గొన్నారు.



ఈదుగల్ల స్వామి కుటుంబానికి అండగా ఉంటాం!

- ఎల్వోసీ అందించిన బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

ప్రతిపక్షం, తొగుట, మార్చి 10: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని వెంకటరావుపేటకు చెందిన ఈదుగల స్వామికి అండగా ఉంటామని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి భరోసా ఇచ్చారు. గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదం మూలంగా స్వామి తీవ్రంగా గాయపడగా హైదరాబాదులో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.. కుడి చేతికి తీవ్రంగా గాయం కావడంతో పరిస్థితి విషమించడంతో కుడి చేతి తొలగించారు.. స్వామి నిరుపేద కావడంతో వైద్య చికిత్స కోసం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లడంతో అయన స్పందించి సీఎం సహాయానిధి ద్వారా రూ. 150000 మంజూరు చేయించగా స్వామి భార్య చంద్రకళ కు అందించారు.. గాయం పెద్దగా ఉండటంతో ప్లాస్టిక్ సర్జరీ కావాల్సి ఉందని, తదుపరి సహాయం కోసం అండగా నిలుస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారికి ధన్యవాదములు తెలిపారు.. నిరుపేద స్వామి కి విషమ పరిస్థితి రావడంతో సహాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా పిలుపు ఇవ్వగానే పెద్ద మనసుతో సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్, ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, జహంగీర్, మిద్దె శ్రీనివాస్, ఎంగలి నరేందర్, నాయకులు డబ్బికారి పెంటోజీ, ఎర్రోళ్ల చంద్రం, వడ్డె నర్సింలు, సుతారి రాములు, ఈదుగాళ్ల పర్శరాములు, కొక్కొండ సురేష్, కత్తుల రమేష్, పాత్కుల బాలేష్, సత్తయ్య, బాలయ్య, ప్రశాంత్, శేఖర్, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టాన్ని ప్రతి పోలీస్ స్టేషన్‌లో

సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 10: సమాచార హక్కు చట్టం-2005ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సమర్థవంతంగా అమలు చేసి, పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డిని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ...సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ఎంతో కీలకమని తెలిపారు. 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వ పనితీరును తెలుసుకునే హక్కు పొందారని అన్నారు. పన్ను చెల్లింపుదారుల డబ్బు ఎలా ఖర్చు అవుతుందో తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రజలు రేషన్ పంపిణీ, పెన్షన్లు, పౌర సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ చట్టం ద్వారా పొందగలరని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే సార్వభౌమాధికారులు కాబట్టి, ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించేందుకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ ,రాష్ట్ర కో ఆర్డినేటర్ కొంగంటి రాజ్ కుమార్, రాష్ట్ర కో కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక శిక్షణకు సిద్ధం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, మార్చి 10: జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఈ నెల 12వ తేదీన జరగనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక శిక్షణా కార్యక్రమానికి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజాప్రతినిధులకు ఒకరోజు శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు వేర్వేరు సిట్టింగ్ ఏర్పాట్లలో పాల్గొనాల్సిందని, ప్రతి ఒక్కరికీ ఐడీ కార్డు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో థీమ్స్ వారీగా జిల్లా అధికారులు ఓరియెంటేషన్ వివరాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీపీఓ రవీందర్ తదితర అధికారులు ఉన్నారు. కార్యక్రమం రెండు సెషన్లలో నిర్వహించబడనుంది, అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా పూర్తి చేయబడతాయని అధికారులు తెలిపారు.




పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలి

ప్రతిపక్షం,దౌల్తాబాద్, మార్చి 10: పశువులను ప్రాణధక వ్యాధుల నుంచి రైతులు రక్షించుకోవాలని దొమ్మాట సర్పంచ్ దేవి గారి అంజయ్య, పశు వైద్య అధికారి పరశురాం అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మట గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం 10 నుంచి ఏప్రిల్ 9 వరకు నెల రోజుల పాటు కొనసాగుతుందని పశువైద్య శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో నిర్దేశించిన తేదీల ప్రకారం పశువైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని అధికారులు సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకొని ప్రతి పశువుకు టీకా వేయించుకోవాలని వారు కోరారు. రైతులు పశువులకు టీకాలు వేయించే ముందు తమ వెంట తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి నిరసన

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 10: మెదక్ మండలం పాతూరు గ్రామంలో ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. హవేలీ ఘనాపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన వెంకట్ రాంరెడ్డి తన వ్యవసాయ పొలంలో సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఇతరులకు కూడా కనెక్షన్లు ఇవ్వడంతో లోడ్ పెరిగిందని తెలిపాడు.ఇతరుల కనెక్షన్లు తొలగించాలని అధికారులను పలుమార్లు కోరినా స్పందన లేకపోవడంతో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. సమాచారం అందుకున్న మెదక్ రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని యువకుడిని నచ్చజెప్పి కిందికి దించారు.



సరిపడేంత పెన్షన్ అందించాలి

- ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ సీనియర్ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 10: ఆర్టీసీలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు, కార్మికులకు సరిపడేంత పెన్షన్ అందివ్వాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ సీనియర్ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి నాగేశ్వర రావులు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కే ఎన్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్ లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉద్యోగులతో పాటు రాష్ట్ర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 తర్వాత ఆర్టీసీలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కార్మికులకు ఎంతో కొంత పెన్షన్ వస్తుందని.. అంతకుముందు రిటైర్డ్ అయిన వారికి మాత్రం 1000, 1500 మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలు ఆర్టీసీలో పనిచేసి శేష జీవితం గడుపుతున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఒకరిపై ఆధారపడి ఉండకుండా వారి జీవనానికి సరిపడా పెన్షన్ను అందించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఒక ఆర్టీసీకి మాత్రమే కాకుండా మిగతా కార్పొరేషన్ లలో కూడా ఇదే పరిస్థితి ఉందని, వారందరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఢిల్లీలో సైతం ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, కృష్ణారెడ్డి, రఘుపతి రెడ్డి పలువురు పాల్గొన్నారు.

మహిళ హత్య..

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 10 : ఏడుపాయల వద్ద ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట్ మండలం కొడుపాక గ్రామానికి చెందిన బ్యాగరి సులోచన (35) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఉదయం పనికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు.మంగళవారం ఉదయం ఏడుపాయల సమీపంలోని చెలిమకుంట వద్ద అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతురాలి ముఖంపై కర్రతో దాడి చేసిన గాయం కనిపించింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతురాలి సోదరుడు దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



షాపుల్లో లేని యూరియా

యాపుల్లో ఎలా ఉంటుంది

- కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే చిన్న చూపు
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 10: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి నుంచి రైతులంటే చిన్న చూపే ఉందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమయానికి రైతుబంధు అందించారని,వ్యవసాయాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా నిలిపారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పంట కోతకు వచ్చిన కూడా ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. అలాగే కందుల కొనుగోలు లో రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న నియమ నిబంధన వల్ల తక్కువ ధరకే రైతులు కందులను బయట మార్కెట్లో అమ్ముకుంటున్నారన్నారు. రైతులు యూరియా దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారని,షాపుల్లో లేని యూరియ యాపుల్లో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఉగాది పండుగలోగా రైతులందరికీ రైతుబంధు అందించి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్ లు నాగరాజు రెడ్డి, మల్లిఖార్జున్, నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, పొన్నమల్ల రాములు, ఇర్షాద్ హుస్సేన్, సత్యం రెడ్డి, దరిపల్లి శ్రీనివాస్, సయిద్ , సాయి చరణ్ గౌడ్ కిట్టు, శ్రీనివాస్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సిద్దిపేటలో 'ఆరోగ్య ఖాకీ' కార్యక్రమం ప్రారంభం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 10: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్య సంక్షేమం కోసం "ఆరోగ్య ఖాకీ - పోలీస్ వెల్నెస్, ఫిట్నెస్ ఇనిషియేటివ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ రష్మీ పెరూమాళ్ ముఖ్య అతిథిగా హాజరై హెల్త్ ప్రొఫైలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్యుల బృందం పోలీసులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ధనరాజ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేష్ బాబు, ఆర్ఎంఓ జి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ పోలీసులు, డాక్టర్లు 24 గంటలు విధుల్లో ఉండే వృత్తులు కావడంతో శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండటం చాలా అవసరమని తెలిపారు. నిరంతర పని ఒత్తిడి కారణంగా యువ పోలీసుల్లో కూడా ఆహారం, నిద్ర వంటి ఆరోగ్య అలవాట్లపై నిర్లక్ష్యం పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతి పోలీస్ అధికారికి వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్ రూపొందించబడుతుందని, పరీక్షల్లో ఏవైనా సమస్యలు కనిపిస్తే ముందుగానే గుర్తించి తగిన వైద్య సలహాలు ఇవ్వబడతాయని తెలిపారు. ప్రారంభ దశలో మొదటి రోజు సుమారు 200 మంది పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

“



ఇజ్రాయెల్, ఇరాన్ నేతలకు పీఎం మోదీ ఒక్క ఫోన్ చేస్తే యుద్ధం ఆగుతుంది. గల్ఫ్ నేతలే కాకుండా ప్రజలు, బిజినెస్ కమ్యూనిటీల్లోనూ మోదీపై గౌరవం ఉంది. యుద్ధంలోకి దిగే ఆలోచన మాకు లేదు. యూఏఈని లాంచింగ్ ప్యాడ్‌గా వాడుకునేందుకు అంగీకరించబోం. ఇరాన్ మా పొరుగు దేశం... ఇజ్రాయెల్ మిత్రపక్షం, రెండింటితోనూ చర్చలు జరపగలం.

- ఇండియాలో యూఏఈ రాయబారి హుస్సేన్ హసన్ మీర్జా

ప్రాంతీయం



వికలాంగుల హక్కులకు కోసం
13న హైదరాబాద్ లో సామూహిక నిరాహార దీక్ష

- వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలి
- ఎన్ పీ ఆర్డీ ప్రధాన కార్యదర్శి యం అడివయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 10 : వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలని,ఎంపిక అయిన లబ్ధిదారులకు పరికరాలు వెంటనే పంపిణి చేయాలని,బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 13 హైదరాబాద్లో సామూహిక నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయం లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 27 నెలలు అవుతుంది.అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగుల పెన్షన్4016 నుండి 6000 లకు పెంచడంతో పాటు చేయూత పెన్షన్స్ 2016 నుండి 4000 లకు పెంచి, 2023 డిసెంబర్ నెల నుండే అమలు చేస్తామని ప్రకటించారు.కానీ 27 నెలలు అవుతున్న పెన్షన్ పెంపుకోసం ప్రభుత్వం ఆలోచించకపోవడం అంటే చేయూత లబ్ధిదారులను మోసం చేయడమే అవుతుంది. పెన్షన్స్ పెంచడానికి డబ్బులు లేవని చెపుతున్న ముఖ్యమంత్రి గాంధీ కుటుంబానికి అవసరం అయితే 1000 కోట్లు రాష్ట్రం నుండి ఇస్తామని ఎలా చెప్తారని ప్రశ్నించారు. 5000 కోట్లతో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెపుతున్న ముఖ్యమంత్రికి చేయూత పెన్షన్స్ పెంచలనే ఆలోచన ఎందుకు రావడం లేదు.ప్రజాపాలన అంటే ఎన్నికలకు ముందు మాట ఇచ్చి మాట తప్పడమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచెందుకు మార్చి 13 నాడు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద వికలాంగులతో సామూహిక నిరాహార దీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ పీఆర్ డీ మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు టి యాదగిరి, సహాయ కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై కన్న కొడుకును అమ్మిన తండ్రి

- నిందితుల అరెస్టు రిమాండ్ తరలింపు
- మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 10: మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో తన సొంత కొడుకుని అమ్ముకోవడం జరిగిందని మెదక్ డి.ఎస్.పి ప్రసన్నకుమార్ తెలిపారు మెదక్ డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ హవిలి ఘనపూర్ మండలం లింగసాస్ పల్లి తాండ కు చెందిన కేతావత్ మంజుల భర్త మహేష్ మెదక్ మత శిశు సంరక్షణ కేంద్రం లో ఒక మగ శిశువు కు జన్మనిచ్చింది. అయితే మంజుల గత వారం రోజుల నుండి అంగన్వాడీ కేంద్రం నందు లభించే అనుబంధ పోషకాహారం గురించి రాకపోవడం తో, అంగన్వాడీ టీచర్ మంజుల ఇంటికి వెళ్ళ విచారించగా వారు ఇంటికి తాళం వేసి వెళ్ళివారని, విషయాన్ని ఐసీడీఎస్ సెక్టార్ ఇంచార్జ్ వర్ల విజయ లక్ష్మి తెలిపింది. కేతవత్ మంజుల ఆమె భర్త మహేష్ హావేలీఘనపూర్ కి చెందిన కుమ్మరి నాగరాజు, అతని భార్య స్వప్నలతో వాళ్ళ మగ శిశువు ను అయిదు లక్షలకు అమ్ముటకు నిర్ణయించకోని, తరువాత ఒక లక్ష యాభై వేల రూపాయలకు బేరం కుదుర్చుకుని హావేలీఘనపూర్ మండలంలోని శాలిపేట గ్రామ శివారులో ఇట్టి విషయాన్ని స్టాంప్ పేపర్ పై రాసుకొని భార్య భర్తలు ఇద్దరు సంతకాలు చేసుకొని బాబు ని వారికి అప్పగించారని మెదక్ డీఎస్పి తెలిపారు. మంజుల ఆమె భర్త మహేష్ లు ఇద్దరు చేగుంట బస్ స్టాప్ వద్ద ఉండగా ఐసీడీఎస్ సెక్టార్ ఇంచార్జ్ పర్ల విజయ లక్ష్మి వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చినారు. మెదక్ డీఎస్పి తెలిపారు. SI హావేలిఘనపూర్ మగ శిశువు తల్లి తండ్రులను విచారించగా వారు వారి ఆర్థిక ఇబ్బందుల వల్ల మద్యానికి బానిసైన మహేష్ శిశువును అమ్మడం జరిగింది. కుమ్మరి నాగరాజు, అతని భార్య స్వప్నలను విచారించగ వారు, వారి బందువు లైన కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన నరసొల్ల రాజు, అతని భార్య నరసొల్ల స్వప్న లకు పిల్లలు లేనందున కేతవత్ మంజుల ఆమె భర్త మహేష్ ల ఒక నెల మగ శిశువును, ఒక లక్ష యాభై వేల రూపాయలకు బేరం కుదుర్చుకుని ఆ మగ శిశువునా వారి బంధువుల అప్పచెప్పినారు. ఆ తరువాత si సత్యనారాయణ సిబ్బంది తో కలసి హుటాహుటిన భిక్నూ మండలంలోని, కంచర్ల గ్రామానికి వెళ్ళి నరసొల్ల రాజు దగ్గర నుండి మగ శిశువును తీసుకొని, శిశువు తల్లి కేతా మంజుల కు సఖి కేంద్రం లో వారిని అప్పజెప్పడం జరిగిందని మెదక్ డీఎస్పి తెలిపారు ఈ కేసులో 6 మంది నిందితులను పై కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలిస్తున్నట్లు మెదక్ డీఎస్పి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు అమ్మిన కొన్న నేరమేనని ఒకవేళ పిల్లలు లేనివారు ఎవరైనా శిశువులను కావాలనుకుంటే ఐసిడిఐసి వారిని సంప్రదిస్తే వారి చట్టప్రకారం ఒక ప్రాసెస్ ఉంటుందని ఆయన తెలిపారు ఈ మీడియా సమావేశంలో మెదక్ సిఐ జార్జ్ ఘన్పూర్ ఎస్సై సత్యనారాయణ కానిస్టేబుళ్లు జయనంద్. లడ్డు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు ఎగ్జామినేషన్
కిట్ అందజేత

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 10: చేగుంట మండలం మక్కారాజు పేట జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎగ్జామినేషన్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి పిసి బాల్ శెట్టి రాజాగౌడ్ నల్ల ప్రవీణ్ కుమార్ బెస్త స్వామి రాజిరెడ్డి జిఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



భూ హక్కుల కోసం పక్కాగా రీసర్వే

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ,మార్చి 10: పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల పూర్వం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్ష ను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటినుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యల తలెత్తయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొందపరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని ,భూమికోసం రైతులు పరితపిస్తూ ఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.జిల్లాలో 24 గ్రామాల్లో భూ రిసర్వే ను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్తామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్ళు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి,ఎ.డి ల్యాండ్ సర్వే కిషన్, డి.పి ఆర్ ఓ రామచంద్ర రాజు, తహసిల్దార్ రజనీ,ఎంపీడీవో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ లో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ మున్సిపల్ పరిధిలోని 9వ, 26వ, 27వ వార్డు,లలో మంగళవారం మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, దీపక్ కుమార్, పల్లె రాణి బాలరాజు.లు వార్డులలో పర్యటించడం జరిగింది, ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు, మంచినీటి సౌకర్యం, పలు సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని. పరిశుభ్రత అనేది చాలా అవసరం అని అపరిశుభ్రత వాతావరణం లో అనేక రోగాలు వస్తాయని, అందువలన పరిసరాలు కూడా పరిశుభ్రత పాటించాలని ఇటు ప్రజలు కూడా సహకరించాలని మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది మురికి కాలువలు, పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లాలని ఆయన ఆదేశించారు, 26వ వార్డులో శిధిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించారు స్థానిక 26వ వార్డు కౌన్సిలర్ దీపక్ కుమార్ అడిషనల్ కలెక్టర్ నగేష్ దృష్టికి, చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు, సమస్యలను పరిష్కరిస్తామని అడిషనల్ కలెక్టర్, చైర్మన్, వైస్ చైర్మన్ హామీ ఇవ్వడం జరిగింది. వారినీ కౌన్సిలర్ దీపక్ కుమార్ ఘనంగా సన్మానించారు.



ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 10: కలెక్టరేట్ పక్కన ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి మంగళవారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి గోదాంను నియమావళి ప్రకారం తెరిచి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిద్ధిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గదుల ద్వారాలు, వాటిపై ఉన్న సీల్స్‌ను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, గోదాం లోపల, బయట పరిసర ప్రాంతాల్లో జరిగే ప్రతి చర్య సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతుందని కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీటీ బాలరాజు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల బడ్జెట్ ఖర్చులో
నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్ సమావేశాలలో ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం కింద కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం, వివక్షతను ప్రదర్శిస్తుందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. ఎస్సీ ఎస్టీ ఎస్డిఎఫ్ బడ్జెట్ కేటాయింపులు ఖర్చులపై శ్వేత పత్రం ప్రకటించాలని, అంబేద్కర్ అభయాస్తం పథకాన్ని ప్రారంభించాలని, చేవెళ్ల డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు నిజాంపేట్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ముఖ్య అధిదిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 26 బడ్జెట్లో దళితుల ప్రత్యేక నిధి కింద 40,231 కోట్లు కేటాయించగా కేవలం 16, 374 కోట్లు మాత్రమే విడుదల చేయగా 6,726 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమైనావని అన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభిస్తామని 12 లక్షలు కేటాయిస్తామని చెప్పినప్పటికీ నేటికి కార్య రూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న ఎస్సీ యాక్షన్ ప్లాన్ ను విడుదల చేసిన పాపానికి పోలేదన్నారు. స్వయం ఉపాధి ఆర్థిక పథకాలు అమలుగాక నిరుద్యోగ యువత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో ఉపాధి లేక ఇబ్బందుల పాలవుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల కోసం ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకపోవడం చూస్తుంటే ముఖ్యమంత్రి మాటలు నిజమేనని రుజువు అవుతుందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం వెంటనే పెన్షన్ల ను పెంచుతూ జీవో జారి చేయాలని పెన్షన్ల కోసం దరఖాస్తు తీసుకున్న ప్రతి ఒక్కరికి పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దు బా సి సంజీవ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 10: శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి దూరమవుతుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు.మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం పోలీసు వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు.క్రీడోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించి పోలీసు సిబ్బంది నుంచి వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ అనేక సవాళ్లను ఎదుర్కొంటారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. క్రీడా పోటీలు సిబ్బందిలో ఐక్యత, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విధుల్లో ఎంత నిబద్ధతతో పనిచేస్తారో, అదే ఉత్సాహంతో క్రీడల్లో కూడా పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు.ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్ ,వాలీబాల్, కబడ్డీ,బ్యాడ్మింటన్, పరుగుపందెం, లాంగ్ జంప్, షాట్ పుట్ వంటి పలు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ముగింపు కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐలు మహేష్, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి,జాన్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలతోనే మంచి సమాజ నిర్మాణం

- వంగ మహేందర్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి



ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 10: మంచి సమాజం నిర్మాణం మహిళలతోనే సాధ్యమవుతుందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సిద్దిపేటలోని పీఆర్టీయూ భవన్లో జరిగిన ఈ వేడుకలకు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రవాస భారతీయ విద్యావేత్త గడ్డం వాణీదేవి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధర శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో మొట్ట మొదటి మహిళ అమ్మ అని చెప్పారు. ప్రతి వ్యక్తి జీవితంలో అమ్మ పాత్ర గొప్పదన్నారు. మాతృ మూర్తులు కుటుంబంలోని పిల్లలను క్రమశిక్షణతో పెంచితే భవిష్యత్తు సమాజం అద్భుతంగా తయారవుతుందని తెలిపారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా సమాజ గమనానికి మూల కారణం మహిళ అని పేర్కొన్నారు. గతంలో మహిళలు కొన్ని రంగాలకే పరిమితం అయ్యారని చెప్పారు. కానీ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని తెలిపారు. రాజకీయాలు, పరిపాలనా రంగం, వ్యాపార రంగంతో పాటు అన్ని రంగాలలో మహిళలు అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నారని చెప్పారు. అయినా వివక్ష కొనసాగుతోందని చెప్పారు. మహిళల పట్ల వివక్ష పాటించకుండా వారిని ప్రోత్సహించి సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. మహిళ తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని వంగ మహేందర్ రెడ్డి అన్నారు

మహిళలు అనుకున్నది సాధించి ఎదగాలి

ప్రవాస భారతీయ విద్యావేత్త గడ్డం వాణీదేవి మాట్లాడుతూ ప్రత్యేక పని చేపట్టినప్పుడు ముందుగా సవాళ్లు ఎదుర్కోవడం సహజమని చెప్పారు. సవాళ్లకు ఎదురు నిలబడితే కచ్చితంగా విజయం సాధ్యమవుతుందని తెలిపారు.. ప్రతి మహిళ తాను ఎంచుకున్న రంగంలో విజయం సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. నంతరం ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాలు, వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 200 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పత్రిక సంపాదక వర్గ సభ్యురాలు లక్కిరెడ్డి విజయ,పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర బాధ్యులు పాతూరి సుజాత, జి.మాలతి, పాతూరి రమాదేవి, భాగ్యమ్మ, మంచినీళ్ల సరస్వతి, డాక్టర్ శైలజ, మంజుల, స్వప్న, పద్మ, మహిళా నేతలు, మహిళా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.




బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏకు తమిళనాడులో ఎంట్రీ లేదు. తమిళనాడుకు ఏమీ ఇవ్వకూడదనుకునే వారికి ప్రజలు ఎలా ఓట్లు వేస్తారు? అయినా ఓట్లు అడిగేందుకు వాళ్లెలా వస్తారు? ఈ ఎన్నికలు తమిళనాడు-, ఎన్డీఏ మధ్య, డీఎంకే టీమ్‌కు -ఢిల్లీ టీమ్‌కు మధ్యే జరుగుతున్నాయి. ఏఐఏడీఎంకేను మింగేయాలని బీజేపీ చూస్తోంది. ఆ పార్టీని చూస్తే జాలి కలుగుతోంది.

- తమిళనాడు సీఎం స్టాలిన్

ప్రభుత్వ ఒత్తిడికి లొంగిపోయారు

- లోక్‌సభలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మాన చర్చలో విపక్ష ఎంపీల వాదన
- అరాచకవాదులను కట్టడి చేయాల్సిందే: పాలక పక్షం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 10: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ జరిగింది. ఓం బిర్లాను పెద్ద మనిషిగా కొనియాడుతూనే విపక్షంపై ఆయన తీసుకున్న కఠిన చర్యలను ప్రతిపక్ష సభ్యులు ఎండగట్టారు. ఈ ఆరోపణను ఖండించిన అధికార కూటమి విపక్ష సభ్యుల అరాచక ప్రవర్తనను అడ్డుకునేందుకే స్పీకర్ అలా ప్రవర్తించారని చెప్పారు. డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు సహా పలువురు విపక్ష ఎంపీలు ప్రభుత్వ ఒత్తిడికి స్పీకర్ లొంగిపోయారని ఆరోపించారు. స్పీకర్‌ను తాను వ్యక్తిగతంగా ఎంతో గౌరవిస్తానని, కాని ఆయన తన ప్రవర్తనను సరిదిద్దుకోవలసి ఉంటుందని టీఆర్ బాలు పేర్కొన్నారు. స్పీకర్ ఓం బిర్లా చాలా పెద్ద మనిషి. కాని ఆయన ఎందుకు మారిపోయారో తెలియడం లేదు. గత ఏడేండ్లలో ఆయన చాలామంది ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేశారు. అంత కఠిన చర్యలను ఎందుకు తీసుకోవలసి వచ్చింది? స్పీకర్ నిజాయితీగా వ్యవహరించాలని నేను కోరుకుంటున్నాను అని టీఆర్ బాలు సూచించారు. దీనికి ఎన్‌డీఏ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు స్పందిస్తూ 2019 నుంచి మొదటిసారి స్పీకర్‌గా నియమితులైన నాటి నుంచి ఓం బిర్లా సభను ఎంతో హుందాగా, నిజాయితీగా నడుపుతున్నారని ప్రశంసించారు. శివసేన(యూబీటీ) సభ్యుడు అరవింద్ సావంత్ కూడా ఓం బిర్లాను పెద్ద మనిషిగా కీర్తించారు. అయితే విపక్షానికి వ్యతిరేకంగా పనిచేయాలని ఒత్తిడి ఉందని ఆరోపించారు. ఇప్పటివరకు డిప్యూటీ స్పీకర్‌ను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు.



విశ్వ వీక్షణం







వేడి చేస్తే విషమే

మనలో చాలా మందికి ఒకసారి వండిన ఆహారాలను మళ్లీ మళ్లీ వేడి చేసి తినే అలవాటు ఉంటుంది. కానీ కొన్ని ఆహారాలను మళ్లీ వేడి చేస్తే విషంలా మారుతాయి. అవేంటంటే?

మనం తినే ఆహారమే మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. కానీ మనం హెల్తీ ఫుడ్ నే తిన్నా అవి మన ఆరోగ్యాన్ని పాడు చేయొచ్చు. అది కూడా వాటిని మళ్లీ వేడి చేసి తింటే. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మనం వాటిని ఎలా తింటున్నాం? ఎలా వండుతున్నాం? అనే దానిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తప్పుడు ఆహారపు అలవాట్లు మనల్ని ఎన్నో అనారోగ్య సమస్యల బారిన పడేస్తాయి. వీటిలో ఆహారాలను పదే పదే వేడి చేసి తినడం ఒకటి. ఇలా తినడం వల్ల మీకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.







ఓవర్ కుకింగ్

సాధారణంగా అప్పుడే వండిన ఆహారాలు మన ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ కొంతమంది ఉదయం వండిన ఆహారాలను రాత్రి వరకు తింటారు. అలాగే రాత్రిపూట వాటిని మళ్లీ వేడి చేసుకుని తింటుంటారు. కానీ ఈ అలవాటు ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. అలాగే వంటను ఎక్కువ సేపు చేయడం కూడా మంచిది కాదు. అంటే ఎక్కువగా ఉడికించకూడదు.
ముఖ్యంగా కొన్ని ఆహారాలను ఎక్కువగా ఉడికిస్తే వాటిలో ఉండే పోషకాలు తగ్గి మన శరీరానికి హాని చేస్తాయి. దీనివల్ల మీకు క్యాన్సర్ కూడా రావొచ్చు. అందుకే వేటిని మళ్లీ వేడి చేసి తినకూడదో తెలుసుకోండి.

బంగాళదుంప

చాలా మంది ఆలుగడ్డ కూరను చాలా ఇష్టంగా తింటుంటారు. అందుకే వారానికి రెండు మూడు సార్లైనా చాలా మంది ఇండ్లలో ఆలుగడ్డ కూర ఉంటుంది. కానీ ఆలుగడ్డ కూరను మళ్లీ వేడి చేసి తినకూడదు. ఎందుకంటే బంగాళదుంపలో కార్బోహైడ్రేట్లు ఎక్కువ మొత్తంలో ఉండటం వల్ల దీన్ని ఎక్కువసేపు వండడం వల్ల అందులో అక్రిలామైడ్ ఏర్పడుతుంది. ఇది క్యాన్సర్ కు కారణమవుతుంది. అందుకే బంగాళా దుంప కూరను మళ్లీ వేడి చేయకూడదు. ఎక్కువ సేపు ఉడికించకూడదు.



ప్రాసెస్ చేసిన మాంసం

ప్రాసెస్ చేసిన మాంసం చాలా టేస్టీగా ఉంటుంది. అందుకే ఇవి ఎక్కువ పడితే అక్కడ దొరుకుతున్నాయి. అయితే ఈ మాంసం పాడవకుండా ఉండటానికి దీనిలో కెమికల్స్ ను వాడతారు. ఒకవేళ మీరు వీటిని వేడి చేసి తింటే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది.

చేపలు

చేపల కూరను కూడా మళ్లీ మళ్లీ వేడి చేసి తినకూడదు. చాలా మంది చేపల కూరను చాలా ఇష్టంగా తింటారు. అందుకే ఒకేసారి చాలా మొత్తంలో వండేసి తర్వాతి పూటకు వేడి చేసి తింటుంటారు. కానీ చేపల కూరను వేడి చేసి అస్సలు తినకూడదు. చేపల్లో ప్రోటీన్లు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెండుగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. చేపలను తింటే కళ్లు బాగా కనిపిస్తాయి. కానీ చేపల కూరను మళ్లీ మళ్లీ వేడి చేస్తే దాంట్లో ఉండే పోషకాలు లేకుండా పోతాయి. అలాగే ఈ కూర మీ శరీరానికి హాని చేస్తుంది. అందుకే చేపల కూరను చేసినప్పుడు దాన్ని మళ్లీ మళ్లీ వేడి చేయకుండా ఉండండి.


వైట్ బ్రెడ్

వైట్ బ్రెడ్ ను మళ్లీ మళ్లీ వేడి చేసి తినే అలవాటు చాలా మందికి ఉంటుంది. కానీ ఈ బ్రెడ్ లో కార్బోహైడ్రేట్లు, చక్కెర ఎక్కువగా ఉంటాయి. వీటిని వేడి చేస్తే వాటిలో అక్రిలామైడ్ ఏర్పడుతుంది. క్యాన్సర్ కు కారణమవుతుంది.

వంట నూనె

వంటనూనెను అస్సలు మళ్లీ మళ్లీ వేడి చేయకూడదు. ఒక్కసారి ఉపయోగించిన నూనెను మళ్లీ వాడకూడదు. కానీ చాలా మంది డీప్ ఫ్రై చేసిన నూనెను తిరిగి కూరలకు, ఇతర వంటకు ఉపయోగిస్తుంటారు. కానీ నూనెను మళ్లీ మళ్లీ వేడి చేస్తే దాంట్లో హానికరమైన రసాయనాలు ఏర్పడతాయి. ఇవి మనకు క్యాన్సర్ వచ్చే రిస్క్ ను పెంచుతాయి.





దేశంలో పెరుగుతున్న గ్యాస్ కొరత

- 8 రాష్ట్రాల్లో హోటళ్లపై తీవ్ర ప్రభావం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 10: పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించిన ప్రకంపనలు భారత్‌లోని వంటిళ్లు, వాణిజ్య ఎల్పీజీపై పూర్తిగా ఆధారపడే హోటళ్లు, రెస్టారెంట్లను తాకుతున్నాయి. ఇరాన్ ఘర్షణల ప్రభావం, హొర్ముజ్ జలసంధి మూసివేత ప్రభావం వంట గ్యాస్ కొరతకు దారితీసింది. గత కొన్ని రోజులుగా ఎల్పీజీ ఏజెన్సీల వెలుపల ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు బారులు తీరి నిలబడిన దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అయితే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల కొరత వేగంగా దేశంలోని అనేక నగరాలకు విస్తరిస్తున్నది. బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా, లక్నో తదితర నగరాల్లో వాణిజ్య ఎల్పీజీ కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం భారత్ తన గృహోపయోగ ఎల్పీజీ అవసరంలో 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నది. ఇందులో దాదాపు 8590 శాతం హొర్ముజ్ జలసంధి మీదుగానే సరఫరా జరగవలసి ఉంటుంది. హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో దాని ప్రభావం భారత్ ఎల్పీజీ దిగుమతులపై పడుతున్నది. భారత్ ఏటా దాదాపు 3.1 కోట్ల టన్నుల ఎల్పీజీని వినియోగిస్తున్నది. ఇందులో 87 శాతం గృహ రంగంలో గృహాల కోసం ఉపయోగిస్తుండగా మిగిలిన వాటా హోటళ్లు, రెస్టారెంట్లకు వెళుతుంది.

8 రాష్ట్రాల్లో హోటళ్లపై తీవ్ర ప్రభావం

పశ్చిమాసియా ఘర్షణలు రెండవ వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాలో అంతరాయం ఆతిథ్య రంగంపై ప్రభావం చూపడం మొదలైంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ సహా అనేక రాష్ట్రాల్లో వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై తాత్కాలిక నిషేధం అమలులోకి వచ్చింది. ఈ నిషేధంతో అనేక నగరాల్లోని రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడగా సరఫరాను పునరుద్ధరించాలంటూ హోటల్ యజమానులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సరఫరా సంక్షోభం కొనసాగితే మనం తినే మసాలా దోస నుంచి మిరపకాయ బజ్జీ దాకా ఆహార పదార్థాలన్నీ ఖరీదైనవిగా మారిపోయే అవకాశం ఉంది. ఇప్పటికీ చాలా రెస్టారెంట్లలో పీఎన్‌జీ కనెక్షన్లు లేదా విద్యుత్తు వంట వ్యవస్థలు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేవు.



నెహ్రూను విమర్శించే వాళ్లు.. ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు

- ప్రియాంక గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 10: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ వేళ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఉదహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూను రేయింబవళ్లు విమర్శించే వారు ఇప్పుడు ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను నవ్వుతున్నానని రిజిజు చెబుతున్నారని, అందుకే రేయింబవళ్లు తనను విమర్శిస్తున్నారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. తమ వాదన కోసం రిజిజు నెహ్రూ వ్యాఖ్యలను ఉటంకించారని తాను తెలియజేస్తున్నానన్నారు. "వారు (రిజిజును ఉద్దేశించి) అకస్మాత్తుగా నెహ్రూను గౌరవించడం ప్రారంభించారు. నెహ్రూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం అలాంటి ప్రసంగం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.కేంద్ర ప్రభుత్వం ముందు తలవంచని ఏకైన వ్యక్తి ఉన్నారని, ఆయనే ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అని ప్రియాంక గాంధీ తెలిపారు. ఈ సభలో విపక్ష నేత ఎటువంటి సంకోచం లేకుండా నిజాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ట్రెజరీ బెంచీలపై కూర్చున్న వారు ఆ సత్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

యుద్ధం ప్రభావం ప్రజలపై పడనీయొద్దు: మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 10: పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు మంగళవారం కీలక సూచనలు చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు, సరఫరాలపై పడే ప్రభావం నుంచి భారతీయులకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర మంత్రులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు దాడులు చేసినప్పటి నుంచి పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. అంతేకాదు భారతదేశంలో ఎల్‌పీజీ సహా ఇతర పెట్రోలియం ఉత్పత్తుల కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలు చెలరేగుతున్నాయి. ఎందుకంటే, భారతదేశం తన ముడిచమురు, సహజ వాయువు అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. అందుకే పెరిగిన ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా ప్రధాని మోదీ తగు చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పెట్రోలియం ఉత్పత్తులుళ, వంట గ్యాస్ కొరత లేకుండా చూడాలని ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేశారని చెప్పాయి.







ఆటలు

ఐపీఎల్ షెడ్యూల్ ఖరారు


టీ20 ప్రపంచకప్ ముగిసిన నేపథ్యంలో క్రికెట్ అభిమానులు వేయికండ్లతో వేచి చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ఎడిషన్ షెడ్యూల్‌పై స్పష్టత వచ్చింది. మార్చి 28 నుంచి మొదలుకానున్న ఈ సీజన్ షెడ్యూల్‌ను రెండు దశల్లో విడుదల చేయనున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా మంగళవారం ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ తెలిపాడు. తొలి దశ షెడ్యూల్‌ను ఈనెల 12 లేదా 13న విడుదల చేసే అవకాశమున్నట్టు ఆయన చెప్పాడు. సైకియా మాట్లాడుతూ.. 'ఐపీఎల్ షెడ్యూల్‌ను రెండు దశల్లో విడుదల చేయనున్నాం. తొలుత 20 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈనెల 12 లేదా 13 తేదీల్లో విడుదల చేస్తాం. రెండో దఫా షెడ్యూల్‌కు సంబంధించి.. అసెంబ్లీ ఎన్నికల తేదీలను బట్టి నిర్ణయం తీసుకుంటాం' అని అన్నాడు. ఈ వేసవిలో తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం విదితమే. అయితే ఏదేమైనా ఐపీఎల్ సీజన్‌ను మే 31తో ముగిస్తామని సైకియా స్పష్టం చేశాడు.



టీమిండియాకు రూ.131 కోట్లు

- భారీ నజరానా ప్రకటించిన బీసీసీఐ

రికార్డు స్థాయిలో దేశానికి మూడో ఐసీసీ టీ20 ప్రపంచకప్పును అందించిన టీమ్‌ఇండియాకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టుకు రూ. 131 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇది 2024 టీ20 వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా రోహిత్ సేనకు ఇచ్చిన (రూ. 125 కోట్లు) నజరానా కంటే రూ. 6 కోట్లు అధికం. కాగా ఈ క్యాష్ రివార్డులో అత్యధిక భాగం క్రికెటర్లకే దక్కనున్నది. ఒక్కో క్రికెటర్‌కు రూ. 6 కోట్లు (15 మందికి రూ. 90 కోట్లు) పోను మిగిలిన రూ. 41 కోట్లను సహాయక బృందానికి అందనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. క్యాష్‌ప్రైజ్ ప్రకటన సందర్భంగా ఆటగాళ్లకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా.. భవిష్యత్‌లోనూ ఈ జైత్రయాత్రను కొనసాగించాలని ఆకాంక్షించాడు.



ఇషా సింగ్ @ టాప్ 3

షూటింగ్ జాతీయ సెలెక్షన్ ట్రయల్స్‌లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ సత్తా చాటింది. మంగళవారం జరిగిన మహిళల 10మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషాసింగ్ 220.6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఆకట్టుకుంది. ఇదే విభాగంలో పోటీపడ్డ ఒలింపిక్ చాంపియన్ మను భాకర్ (246.1), సాన్యం(241.9) వరుసగా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో హైదరాబాద్ షూటర్ ఇషాసింగ్ 580 స్కోరుతో అగ్రస్థానం దక్కించుకుంది. సురభిరావు(578), ముస్కాన్(577) ఆ తర్వాత ఉన్నారు. బుధవారం నుంచి కోచింగ్ క్యాంప్ మొదలుకానుంది.




అర్ష్‌దీప్‌కు ఐసీసీ భారీ జరిమానా

పొట్టి ప్రపంచకప్ విజయాన్ని ఆస్వాదిస్తున్న భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు భారీ జరిమానా పడింది. ఫైనల్ మ్యాచ్‌లో ఐసీసీ నియమావళిని ఉల్లంఘించిన అతడు మ్యాచ్ ఫీజులో పెద్ద మొత్తాన్ని కోల్పోవాల్సి వచ్చింది. న్యూజిలాండ్ క్రికెట్ డారిల్ మిచెల్ మీదకు అకారణంగా బంతిని విసిరినందుకు భారత పేసర్‌కు మొట్టికాయలు వేసింది అత్యున్నత క్రికెట్ మండలి. మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ క్షమాపణలు చెప్పినా ఐసీసీ మాత్రం ఫైన్ ఫైనే అని మరోసారి అలా ప్రవర్తించకుండా కఠిన చర్య తీసుకుంది. మైదానంలో అనుచిత ప్రవర్తనకు పాల్పడిన అర్ష్‌దీప్ ఐసీసీ నియమ నిబంధనలను ఉల్లంఘించడాన్ని నేరంగా పరిగణించాడు. ఆర్టికల్ 2.9 ప్రకారం క్రికెట్ వస్తువులను అగౌరపరచడం, బంతి లేదా.. బ్యాటుతో ఆటగాళ్లను గాయపరచాలని చూడడం వంటివి తీవ్రమైన నేరం కిందకు వస్తాయి. ఫైనల్లో అర్ష్‌దీప్ సైతం ఇలాంటి నేరానికే పాల్పడ్డాడు. సో.. మ్యాచ్ అనంతరం భారత స్పీడ్‌స్టర్‌కు మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించారు. మరో 24 నెలల్లో అతడు ఇలానే పొరపాటు చేస్తే మ్యాచ్ నిషేధం విధించే అవకాశముంది. భారత్, న్యూజిలాండ్ మధ్య నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8న జరిగిన ఫైనల్లో అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ కోడ్‌ను ఉల్లంఘించాడు. టీమిండియా నిర్దేశించిన 256 పరుగుల ఛేదనలో 77 పరుగులకే సగం వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ మిచెల్ శాంట్నర్(43)తో కలిసి డారిల్ మిచెల్ (17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే.. 11 వ ఓవర్లో బంతి అందుకున్న అర్ష్‌దీప్‌ను ఉతికేస్తూ మిచెల్ రెండు భారీ సిక్సర్లు బాదాడు. దాంతో, అసహనానికి గురయ్యాడీ పేసర్. మూడో బంతిని కివీస్ బ్యాటర్ స్ట్రెయిట్ గా ఆడడంతో గబుక్కున అందుకున్న అర్ష్‌దీప్ బంతిని వేగంగా అతడివైపు విసిరాడు. బంతి నేరుగా వెళ్లి మిచెల్‌కు గట్టిగానే తాకింది.



అవి ఏఐ ఫొటోలు..

బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఫొటో తెగ వైరలవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడిగా నటిస్తున్న రణబీర్‌తో పాటు సీతగా నటిస్తున్న సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ.. ఆ ఫొటోలు నకిలివని.. అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతతో సృష్టించిన ఫేస్‌స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో ప్రసారమైన 'సియా కే రామ్' సీరియల్‌లోని స్టిల్స్‌ను తీసుకుని, అందులోని నటీనటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటి భాగం 2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.



27న వస్తున్న 'సుయోధన'

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరిస్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సుయోధన'. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి, వై.ఎస్. మాధవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి సరసన ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా 'డైలాగ్ కింగ్' సాయికుమార్ మరియు సీనియర్ నటి ప్రేమ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ, "ఒక మంచి కథ, కథనాలతో అత్యుత్తమ నిర్మాణ విలువలతో 'సుయోధన' చిత్రాన్ని రూపొందించాము. ప్రియదర్శి, సాయికుమార్ గారి నటన సినిమాకు ప్రాణం పోశాయి. సంగీత దర్శకుడు జై క్రిష్ అందించిన స్వరాలు, రామజోగయ్య శాస్త్రి గారి సాహిత్యం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యాము. త్వరలోనే టీజర్, ట్రైలర్ మరియు పాటలను విడుదల చేస్తాము" అని తెలిపారు.

'ఉస్తాద్ భగత్ సింగ్' సెన్సార్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నేడు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'U/A' సర్టిఫికేట్ జారీ చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో పవన్ నటించిన 'OG' చిత్రానికి గ్యాంగ్‌స్టర్ డ్రామా కారణంగా 'A' సర్టిఫికేట్ రాగా, ఈసారి 'ఉస్తాద్'కు 'U/A' రావడంతో కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి చూసే అవకాశం లభించబోతుంది. మరోవైపు ఈ సినిమా మొత్తం 2 గంటల 29 నిమిషాల రన్ టైమ్‌తో రాబోతుందని సమాచారం. ప్రస్తుత కాలంలో వస్తున్న భారీ సినిమాలతో పోలిస్తే, ఈ కాంపాక్ట్ నిడివి సినిమాకు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్కడా బోర్ కొట్టకుండా పక్కా కమర్షియల్ ప్యాకేజీతో హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలకు ఇప్పటికే భారీ రెస్పాన్స్ వస్తుండగా, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో లెవల్‌కు తీసుకువెళ్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.





అల్లు అర్జున్‌తో నటించాలి

పాన్ ఇండియా స్థాయి క్రేజ్‌ని సొంతం చేసుకుని హాట్ టాపిక్‌గా మారిన ఐకాన్ స్టార్‌పై కర్చీఫ్ వేసేస్తోంది మిరాయ్ పాప రితికా నాయక్. ఢిల్లీలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో హయ్యర్ ఎడ్యూకేషన్ పూర్తి చేసి ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ 12 సీజన్ విజేతగా నిలిచింది. ఆ తరువాత సినిమాల్లో అరంగేట్రానికి చాలా ప్రొడక్షన్ కంపనీల చుట్టూ తిరిగి ఆడిషన్‌లలో పాల్గొంది. ఫైనల్‌గా 2022లో మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా నటించిన `అశోకవనంలో అర్జున కల్యాణం`తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేసింది. ఫస్ట్ మూవీతో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డుని దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. తేజ సజ్జ `మిరాయ్`లో కొంచెం బొద్దుగా మారి విభ క్యారెక్టర్‌లో హీరోకు కర్తవ్యబోధ చేసి తన లక్ష్యాన్ని గుర్తు చేసే క్యారెక్టర్‌లో కనిపించి ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ హీరోగా మిథున్ వరదరాజ కృష్ణనన్ రూపొందిస్తున్న ద్విభాషా చిత్రం `డ్యుయెట్`తో పాటు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న హారర్ థ్రిల్లర్ `కొరియన్ కనకరాజు`లో నటిస్తోంది. ఇందులో `కొరియన్ కనకరాజు` ఈ సమ్మర్‌కు రిలీజ్‌కు రెడీ అవుతోంది. రెండు క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తున్న రితికా నాయక్‌కు ఓ డ్రీమ్ ఉందట. అదేంటంటే ఎప్పటికైనా ఐకాన్ స్టార్ సినిమాలో నటించాలన్నదే తన డ్రీమ్ అంట. అల్లు అర్జున్ సినిమాలో చిన్న రోల్ అయినా సరే నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతోంది. మరి బన్నీ.. రితిక డ్రీమ్‌ని గుర్తించి తన సినిమాల్లో అవకాశం కల్పిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200